www.prajanaava.in

Telugu Daily

ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00


Published from: **Hyderabad, Rangareddy, Karimnagar** Circulated to: **Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad**

హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 56 | శుక్రవారం | 2 అక్టోబర్, 2026

జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓకు తుది మెరుగులు

- రూ.3.4 లక్షల కోట్లకుపైగా విలువైన పబ్లిక్ ఆఫర్
- అమెరికా, బ్రిటన్ సహా ఐదు దేశాల్లో రోడ్‌షోలు పూర్తి

7



సర్ పొడిగింపు లేదు



- 92 లక్షల మందికి నోటీసులిచ్చాం
- ప్రత్యేక సమగ్ర సవరణలో ఈసీ మార్పులు చేసింది
- ఎన్నికల కమిషనర్ సుదర్శన్ రెడ్డి వెల్లడి

2



రాష్ట్రంలో చలి తక్కువే!

2

- ఎల్‌నినో ప్రభావంతో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు
- అక్టోబర్–డిసెంబర్‌లో తక్కువ వర్షపాతం
- ఈ ఏడాది 17శాతం లోటు వర్షాలు
- భారత వాతావరణ శాఖ



రెండు డీఏలు మంజూరు

ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రభుత్వం శుభవార్త

- ఏడాదికి రెండున్నర వేలకోట్ల అదనపు భారం
- ఒక డీఏ రాబోయే జీతాలతో కలిపి పంపిణీ
- తెలంగాణ రాష్ట్ర కేబినెట్ కీలక నిర్ణయాలు
- ఎల్‌నినో పరిస్థితులపై భేటీలో సుదీర్ఘ చర్చ
- కరువు పరిస్థితులపై చర్యలకు సమాలోచనలు
- ప్రాజెక్టులపై పునస్సమీక్షించాలని నిర్ణయం
- 10 ఈపీసీ సాగునీటి ప్రాజెక్టుల నిలిపివేత
- డిజిటల్ మీడియా అడ్వర్టైజింగ్‌కు న్యూ పాలసీ

ప్రజానావ, హైదరాబాద్: తెలంగాణలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో గురువారం సచివాలయంలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం కీలక నిర్ణయాలు తీసుకుంది. ఉద్యోగ సంఘాలు, జేఏసీ నాయకులతో ఇటీవల జరిపిన చర్చల అనంతరం ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు.. రాష్ట్రంలో ఉద్యోగులకు, పింఛన్‌దారులకు నిలిచిపోయిన పెండింగ్ కరువు భత్యాల్లో రెండు విడతల డీఏల విడుదలకు కేబినెట్ అధికారిక ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని లక్షలాది మంది ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు , రిటైర్డ్ పెన్షనర్లకు వేతనాల పరంగా పెద్ద ఊరట లభించనుంది. కేబినెట్ నిర్ణయాల ప్రకారం.. ఉద్యోగులకు 3.64 శాతం , 2.74 శాతం చొప్పున మొత్తం రెండు డీఏలను మంజూరు చేసేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులో భాగంగా ఒక డీఏను త్వరలోనే రాబోయే జీతాలతో కలిపి పంపిణీ చేయనుండగా, మరో డీఏను రాబోయే పండుగలు, తదుపరి షెడ్యూల్ ప్రకారం విడుదల చేయనున్నారు. అంతేకాకుండా, ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన సుమారు రూ. 10,000 కోట్ల పాత జీపీఎఫ్, గ్రాట్యుటీ, మెడికల్ బిల్లుల బకాయిలను ప్రతి నెలా క్రమం తప్పకుండా విడుదల చేస్తూ రాబోయే కాలంలో పూర్తిగా చెల్లించేలా బడ్జెట్ కేటాయింపులపై స్పష్టమైన కార్యాచరణకు అంగీకారం తెలిపింది. డీఏల విడుదలతో పాటు పే రివిజన్ కమిషన్ నివేదిక అమలుపై కూడా కేబినెట్ భేటీలో విస్తృతంగా చర్చించారు. పీఆర్సీ కమిటీ అందించే తుది నివేదికను పరిశీలించి, వీలైనంత త్వరగా కొత్త వేతన సవరణపై నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నారు.

సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నామని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఉద్యోగ సంఘాల విన్నపాలను సానుకూలంగా పరిశీలించి ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ప్రభుత్వం వెల్లడించింది. కేబినెట్ తీసుకున్న ఈ నిర్ణయంపై ఉద్యోగ సంఘాల నాయకులు హర్షం తరువాయి 2లో..

ఆసీస్‌తో తొలి పోరు

- వచ్చే ఏడాది అక్టోబర్ 7న కేప్‌టౌన్ వేదికగా మ్యాచ్
- 10న దాయాది పాకిస్థాన్‌తో ఢీ
- నవంబర్ 21న జొహన్నెస్‌బర్గ్‌లో ఫైనల్
- 2027 ప్రపంచకప్ వన్డే వరల్డ్ కప్ షెడ్యూల్ విడుదల



దుబాయ్: వచ్చే ఏడాది జరగనున్న ఐసీసీ వన్డే వరల్డ్ కప్ షెడ్యూల్ విడుదలైంది. భారత్ తన తొలి మ్యాచ్ డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాతో తలపడనుంది. అక్టోబర్ 7న కేప్‌టౌన్‌లోని న్యూలాండ్స్ స్టేడియంలో ఈ మ్యాచ్‌తో మెగా టోర్నీ ప్రారంభం కానుంది. అనంతరం అక్టోబర్ 10న జొహన్నెస్‌బర్గ్‌లోని వాండరర్స్ స్టేడియంలో పాకిస్థాన్‌తో భారత్ మ్యాచ్ ఆడనుంది. అక్టోబర్ 14న సెంచూరియన్‌లో క్వాలిఫయర్ జట్టుతో భారత్ తలపడుతుంది. అక్టోబర్ 24న విక్టోరియా ఫాల్స్ స్టేడియంలో సహ ఆతిథ్య దేశం జింబాబ్వేతో పోటీ పడనుంది. ప్రపంచకప్ సెమీఫైనల్ మ్యాచ్‌లు నవంబర్ 17, 18 తేదీల్లో కేప్‌టౌన్, సెంచూరియన్ వేదికల్లో జరగనున్నాయి. 21న జొహన్నెస్‌బర్గ్‌లోని వాండరర్స్ స్టేడియంలో ఫైనల్ నిర్వహించనున్నారు. అక్టోబరు 24 వరకు రౌండ్ రాబిన్ పద్ధతిలో మొత్తం 30 గ్రూప్ స్టేజ్ మ్యాచులు జరగనున్నాయి. అనంతరం అక్టోబరు 25 నుంచి నవంబరు 14 వరకు వరకు సూపర్–7 మ్యాచులు జరుగుతాయి. ఈ దశలో మొత్తం 21 మ్యాచులు ఉంటాయి. నవంబరు 17న సెమీఫైనల్–1, 18న సెమీఫైనల్–2, 21న జొహన్నెస్‌బర్గ్ వేదికగా ఫైనల్ మ్యాచ్ జరగనుంది.

ఖైరతాబాద్ ఉప ఎన్నికకు బ్రేక్

విజయారెడ్డి ఎన్నికల పిటిషన్ తేలేవరకూ నోటిఫికేషన్ ఇవ్వబోం

- హైకోర్టుకు స్పష్టం చేసిన కేంద్ర ఎన్నికల సంఘం
- అక్టోబర్ 6కు విచారణ వాయిదా

ప్రజానావ, హైదరాబాద్: ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. కాంగ్రెస్ నేత పి. విజయారెడ్డి దాఖలు చేసిన ఎన్నికల పిటిషన్‌పై తుది తీర్పు వెలువడే వరకు ఉప ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేయబోమని కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) గురువారం తెలంగాణ హైకోర్టుకు స్పష్టం చేసింది. ఈసీ తరఫు న్యాయవాది అవినాశ్ దేశాయ్ ఈ విషయాన్ని డివిజన్ బెంచ్ ముందు వెల్లడించారు. దీంతో పెండింగ్‌లో ఉన్న ఎన్నికల పిటిషన్ పరిష్కారమయ్యే వరకు ఖైరతాబాద్ స్థానంలో కొత్త ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానట్లైంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా దానం నాగేందర్ విజయం సాధించారు. ఆయన ఎన్నికను సవాల్ చేస్తూ అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి విజయారెడ్డి 2024లో హైకోర్టులో ఎన్నికల పిటిషన్ దాఖలు చేశారు. దానం నాగేందర్ ఎన్నికల అఫిడవిట్‌లో తన భార్య, ఆధారితుల ఆస్తులకు సంబంధించిన కీలక వివరాలను పూర్తిగా వెల్లడించలేదని ఆమె ఆరోపించారు. ఆయన ఎన్నికను రద్దు చేసి, తనను నియోజకవర్గం నుంచి ఎన్నికైన అభ్యర్థిగా ప్రకటించాలని పిటిషన్‌లో కోరారు. ఈ ఎన్నికల పిటిషన్ ప్రస్తుతం హైకోర్టులో పెండింగ్‌లో ఉంది.

ఉప ఎన్నికపై విజయారెడ్డి అభ్యంతరం

దానం నాగేందర్ అనర్హతతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయిన నేపథ్యంలో ఉప ఎన్నిక నిర్వహణకు ఈసీ చర్యలు చేపట్టే అవకాశం ఏర్పడింది. అయితే తన ఎన్నికల పిటిషన్ ఇంకా తుది పరిష్కారానికి రాలేదని పేర్కొంటూ విజయారెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. పెండింగ్‌లో ఉన్న ఎన్నికల పిటిషన్ తేలకముందే ఖైరతాబాద్ స్థానాన్ని సాధారణ ఖాళీగా పరిగణించి ఉప ఎన్నిక తరువాయి 2లో..





ఎన్నికల కమిషన్ కార్యాలయం తగలబడిపోతది

2

- హైదరాబాద్‌లో మాత్రం మామూలుగా ఉండదు
- ఓట్లు పునరుద్ధరించకుంటే ఊరుకునేదే లేదు: దానం

సర్‌లో భాగంగా ఖైరతాబాద్‌లో తీసేసిన ఓట్లు తిరిగి పునరుద్ధరించకుంటే ఊరుకొనేది లేదని దానం హెచ్చరించారు. హైదరాబాద్‌లో మాత్రం మామూలుగా ఉండదు.. తగలబడిపోతుందంటూ వ్యాఖ్యానించారు. సర్ ప్రక్రియలో భాగంగా తన నియోజకవర్గంలో 20 వేల ఓట్లను తొలగించారని దానం చెప్పారు.



ఎవరి ఆదేశాలతో ఫామ్-6లో మార్పులు?

- టీసీఎస్‌కు ఈసీ నుంచి ఎవరు సూచనలిచ్చారు?
- సంస్థలో ఎవరు ఆమోదించారు
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
- ఎన్నికల కమిషనర్ల అభ్యంతరాల నేపథ్యంలో మళ్లీ తెరపైకి ఫామ్–6 వివాదం

2

కొత్త ఓటర్ల నమోదుకు ఉపయోగించే ఆన్‌లైన్ ఫామ్–6లో మార్పులు ఎవరి ఆదేశాలతో జరిగాయో వెల్లడించాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించారు. ఫామ్–6లో మార్పులు చేయాలని టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)కు ఎన్నికల సంఘంలో ఎవరు ఆదేశాలు ఇచ్చారని, టీసీఎస్‌లో ఆ మార్పులకు ఎవరు ఆమోదం తెలిపారని ఆయన నిలదీశారు.

యువత ఆకాంక్షలకు ప్రతీక యూపీఎస్సీ


- ప్రతి ఉద్యోగి పేదల ఆవేదనను అర్థం చేసుకోవాలి
- సిటిజన్ ఫస్ట్ అనేది సివిల్ సర్వీస్ ఉద్యోగుల లక్ష్యం
- ఢిల్లీలో యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని మోదీ
- స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌ను ఆవిష్కరణ
- భారత పైలట్ కెప్టెన్ స్మిత్‌కు ప్రత్యేక అభినందన



న్యూఢిల్లీ: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) పండేళ్ల ప్రస్థానం లక్షలాది మంది యువత ఆకాంక్షలకు, దేశ ప్రజల నమ్మకానికి ప్రతీక అని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. గురువారం ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూపీఎస్సీ శతాబ్ది స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌తో పాటు '100 ల్యాండ్‌మార్క్ జడ్జిమెంట్స్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. నిన్న జరిగిన ఒక విమాన ప్రమాద ఘటనలో అసాధారణ ధైర్య సాహసాలు ప్రదర్శించిన భారత పైలట్, కెప్టెన్ తరువాయి 2లో..

ఆస్తులపై విచారణకు సిద్ధమా?

- సుప్రీంకోర్టు లేదా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో దర్యాప్తు చేయించాలి
- తప్పుతేలితే ఎలాంటి శిక్షకైనా సిద్ధం
- హోటల్ వ్యాపారం అఫిడవిట్‌లోనే చెప్పా
- రేవంత్ కొత్తగా కనిపెట్టిందేమీ లేదు
- సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ సవాల్



ప్రజానావ, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ సవాల్ విసిరారు. తన కుటుంబంతో పాటు రేవంత్‌రెడ్డి కుటుంబానికి చెందిన ఆస్తులపైనా సుప్రీంకోర్టు లేదా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. విచారణలో తన కుటుంబం తప్పు చేసినట్లు తేలితే ఎలాంటి శిక్షకైనా సిద్ధమని ప్రకటించారు. అదే విధంగా ముఖ్యమంత్రి కుటుంబ ఆస్తులపైనా విచారణ జరిపించాలని తరువాయి 2లో..

శివుడు, శ్రీరాముడిని వేరుచేసి వ్యాఖ్యలా?

దేవుళ్లపై మాట్లాడితే ప్రజల మద్దతు రాదు

- ఇచ్చిన హామీలు పక్కనపెట్టి కొత్త వివాదాలు
- సీఎం రేవంత్ వ్యాఖ్యలకు కిషన్ రెడ్డి కౌంటర్



ప్రజానావ, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. పరమేశ్వరుడు పేదల దేవుడని, శ్రీ రాముడు ధనికుల దేవుడని సీఎం చేసిన వ్యాఖ్యలు మతం పేరుతో ప్రజల మధ్య విభేదాలు సృష్టించేలా ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి తన వ్యాఖ్యలతో ఏకంగా దేవుళ్లను కూడా రాజకీయాల్లోకి లాగారని కిషన్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. శివుడు, రాముడి పేర్లతో చేసిన ఈ వ్యాఖ్యలు యావత్ హిందూ సమాజాన్ని అవమానించేలా ఉన్నాయని, హిందువుల మధ్య అనవసర గొడవలు పెట్టే ప్రయత్నమని అన్నారు. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పక్కనపెట్టి, ఇలాంటి కొత్త వివాదాలను ముందుకు తెస్తోందని ఆరోపించారు. ప్రజలను విభజించడం కాంగ్రెస్‌కు అలవాటు అని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా 'హిందూ దేవుళ్లపై మాట్లాడిన విధంగా ఇతర మతాల దేవుళ్ల గురించి మాట్లాడే ధైర్యం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉందా?' అని ఆయన ప్రశ్నించారు.



4న రాష్ట్రంలో అమిత్ షా పర్యటన

2

- బీజేపీ ఆపరేషన్ తెలంగాణకు ప్రణాళిక
- వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా ముందుకు
- కొత్త వ్యూహాలను సిద్ధం చేస్తోన్న కమల దళం

రెండు డీపీలు మంజూరు

(మొదటిపేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. ఉద్యోగుల అంశాలతో పాటు రాష్ట్ర అభివృద్ధి, పరిపాలనా సంస్కరణలపై కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రంలో ధరణి పోర్టల్ స్థానంలో తీసుకురానున్న కొత్త భూ పరిపాలన వ్యవస్థ, నిషేధిత భూముల జాబితా సమీక్ష , రైతులకు సంబంధించిన పలు సంక్షేమ పథకాల అమలుపై సభలో చర్చ జరిగింది. అలాగే రాష్ట్రవ్యాప్తంగా మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనులకు సంబంధించి వివిధ నిధుల మంజూరుకు మంత్రివర్గం అమోదముద్ర వేసింది. గురువారం నాటి కేబినెట్ సమావేశం బహుళ ప్రాధాన్యత కలిగిన నిర్ణయాలతో ముగిసింది. దసరా, దీపావళి పండుగల వేళ విడుదలైన రెండు డీఏల నిర్ణయం ప్రభుత్వ ఉద్యోగ వర్గాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ నిర్ణయానికి సంబంధించిన పూర్తి వివరాలు, చెల్లింపుల షెడ్యూల్ , అర్హతలతో కూడిన అధికారిక జీవోలు ఆర్థిక శాఖ ద్వారా త్వరలోనే వెలువడనున్నాయి.

ఢిల్లీకి మంత్రుల బృందం

ఎల్ నినోను ఎదుర్కోవడంపై కేబినెట్ లో చర్చించారు. సబ్ కమిటీని నియమించనున్నారు. కేంద్రాన్ని సాయం అడగాలని నిర్ణయించారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉన్నందున కరువు మండలాలను ప్రకటించి తగిన సాయం అందించాలని కేంద్రాన్ని తెలంగాణ కేబినెట్ కోరింది. త్వరలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయడంతో పాటు ఢిల్లీకి మంత్రుల బృందం వెళ్లి కేంద్రానికి విజ్ఞప్తి చేయాలని నిర్ణయించింది. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా సుమారు 7,800 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తికి మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రెండు డీఏలను రాష్ట్ర మంత్రివర్గం మంజూరు చేసింది. తెలంగాణ డిజిటల్ మీడియా అడ్వర్టైజింగ్ పాలసీని మంత్రివర్గం ఆమోదించింది. వివిధ కేటగిరీల్లోని భూముల క్రమబద్ధీకరణ కోసం కొత్తగా దరఖాస్తులు స్వీకరించేందుకు వచ్చే మంత్రివర్గ సమావేశంలో చర్చించాలని నిర్ణయించింది. రాష్ట్రంలో ఎల్‌నినో పరిస్థితులపై కేబినెట్‌లో సుదీర్ఘ చర్చ జరిగింది. రాష్ట్రంలో ఈ ఏడాది సుమారు 17 శాతం వర్షపాతం లోటు నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా 235 మండలాల్లో తీవ్ర వర్షాభావంతో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. కరువు ప్రాంతాల్లో తక్షణం చేపట్టాల్సిన చర్యలపై నివేదిక ఇవ్వాలని కేబినెట్ సబ్ కమిటీకి సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. నివేదిక వచ్చిన తర్వాత అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేయాలని మంత్రివర్గంలో నిర్ణయించారు. అఖిల పక్షంతో పాటు రైతు సంఘాలు, వివిధ రంగాల నిపుణులతో భేటీలు ఏర్పాటు చేసి ఉపశమన చర్యలపై సలహాలు సూచనలు స్వీకరించాలని సీఎం తెలిపారు. కరువు మండలాలు ప్రకటించడంతో పాటు.. రాష్ట్రానికి తగిన సాయం అందించాలని కేంద్ర ప్రభుత్వానికి క్యాబినెట్ విజ్ఞప్తి చేసింది. ఎల్‌నినో పరిస్థితులతో గణనీయంగా పెరిగిన విద్యుత్తు వినియోగంపై కేబినెట్ చర్చించింది.

డిమాండ్‌కు అనుగుణంగా విద్యుదుత్పత్తి

రాష్ట్రంలో సాధారణంగా రోజుకు 15వేల మెగావాట్ల విద్యుత్తు వినియోగం ఉండగా ఈ సీజన్‌లో రికార్డు స్థాయిలో 19 వేల 892 మెగావాట్ల డిమాండ్ కు చేరింది.ఈ నేపథ్యంలో డిమాండ్‌కు అనుగుణంగా విద్యుదుత్పత్తి, సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ఎక్కడా కోతల్లేకుండా సరఫరా చేసేందుకు అవసరమైనంత విద్యుత్తును సమకూర్చుకోవాలని, అవసరమైన మేరకు కొనుగోలు చేయాలని నిర్ణయించింది. భవిష్యత్తు డిమాండ్, అవసరాలను దృష్టిలో పెట్టుకొని కొత్తగా పునరుత్పాదక విద్యుత్తు ఉత్పత్తి, విద్యుత్తు సమీకరణపై దృష్టి పెట్టాలని నిర్ణయించింది. దాదాపు 7 వేల 800 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి లక్ష్యంగా యూనిట్లు నెలకొల్పేందుకు ఆమోదం తెలిపింది. ఈ సీజన్‌లో సుమారు 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సి ఉంటుందని పౌరసరఫరాల శాఖ అంచనా వేసింది. అందుకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలు, సిబ్బంది, మౌలిక వసతులను సిద్ధం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎల్‌నినో పరిస్థితులు, ఉష్ణోగ్రతల ప్రభావంతో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగినట్లు కేబినెట్‌లో చర్చించారు. తెలంగాణలో సాధారణంగా రోజువారీ విద్యుత్ వినియోగం సుమారు 15 వేల మెగావాట్ల వరకు ఉండగా.. ఈ సీజన్‌లో పీక్ డిమాండ్ 19,892 మెగావాట్లకు చేరింది. గత ఏడాది గరిష్ఠ డిమాండ్ 16,613 మెగావాట్లుగా ఉంది.పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా రాష్ట్రంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని కేబినెట్ నిర్ణయించింది. అవసరమైన విద్యుత్‌ను కొనుగోలు చేయడంతో పాటు భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని కొత్త విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో మొత్తం 7,800 మెగావాట్ల కొత్త విద్యుత్ సామర్థ్యాన్ని అభివృద్ధి చేసేందుకు కేబినెట్ నిర్ణయించింది. ఇందులో 3,000 మెగావాట్ల సోలార్ విద్యుత్, 4,000 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్, 800 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టులు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పోటీ బిడ్డింగ్ విధానంలో ఈ ప్రాజెక్టులను చేపట్టాలని నిర్ణయించారు. భవిష్యత్‌లో విద్యుత్ డిమాండ్ పెరిగినా సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో సామర్థ్యాన్ని పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది.

ఇంటిగ్రేటెడ్ ఫ్రూట్ మార్కెట్ పనులు వేగవంతం

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ ఫ్రూట్ మార్కెట్ పనులను వేగవంతం చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఈ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వ నిధులతో చేపట్టనున్నారు. కోహెడలో అంతర్జాతీయ ప్రమాణాలతో సమీకృత పండ్ల మార్కెట్ నిర్మించేందుకు ప్రభుత్వం ఇప్పటికే చర్యలు ప్రారంభించింది. జూన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. సుమారు 240 ఎకరాల్లో అత్యాధునిక సదుపాయాలతో మార్కెట్‌ను అభివృద్ధి చేయనున్నట్లు ప్రభుత్వం అప్పట్లో వెల్లడించింది. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పునఃసమీక్షించాలని కేబినెట్ నిర్ణయించింది. గతంలో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా అసంపూర్తిగా ఉన్న 10 ఈపీసీ సాగునీటి ప్రాజెక్టులను నిలిపివేయడానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితి, వ్యయం, ప్రయోజనాలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పనులపై ప్రభుత్వం సమీక్ష కొనసాగించనుంది. ఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ పోస్టును మంజూరు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. అలాగే ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వానికి సంబంధించిన వ్యవహారాలను సమన్వయం చేసేందుకు నలుగురు గ్రూప్–1 అధికారులను నియమించేందుకు ఆమోదం తెలిపింది. తెలంగాణలో డిజిటల్ మీడియా సంస్థలకు సంబంధించి ప్రత్యేక ప్రకటన విధానాన్ని తీసుకురావడానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. కేంద్ర ప్రభుత్వ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) విధానానికి అనుగుణంగా రాష్ట్రానికి ప్రత్యేక డిజిటల్ మీడియా అడ్వర్టైజింగ్ పాలసీ రూపొందించనున్నారు. ఈ విధానం ద్వారా డిజిటల్ మీడియాకు ప్రభుత్వ ప్రకటనల జారీకి ప్రత్యేక మార్గదర్శకాలు ఏర్పడే అవకాశం ఉంది.

యువత ఆకాంక్షలకు ప్రతీక యూపీఎస్సీ

(మొదటిపేజీ తరువాయి)

స్మిత్ మచ్చర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఫ్లై దుబాయ్ విమాన ఘటనలో భారత పైలట్ కెప్టెన్ స్మిత్ చూపిన ధైర్యం, సమయస్ఫూర్తి, నిబద్ధత ప్రశంసనీయం. ఇజ్రాయెల్ ప్రధాని చెప్పినట్లుగా, 9/11 తరహా ఘోర విషాదాన్ని ఒక భారతీయుడు అడ్డుకున్నాడు అని మోదీ అన్నారు. స్మిత్ ఘనత మనందరికీ గర్వకారణమని, తాను ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడానని తెలిపారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న స్మిత్ సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని దేశ ప్రజలందరూ ప్రార్థించాలని పిలుపునిచ్చారు. యూపీఎస్సీ వందేళ్ల ప్రస్థానంపై మోదీ మాట్లాడుతూ.. ఇది కేవలం ఒక సంస్థ వందేళ్లు పూర్తి చేసుకోవడం కాదు, ఇది లక్షలాది యువత ఆశయాల వేదిక. ప్రతి భారతీయుడు ఈ సంస్థపై ఉంచిన అచంచల విశ్వాసానికి ఇది నిలువుటద్దం. ఈ సంస్థను ఉన్నత శిఖరాలకు చేర్చిన ప్రతి ఒక్కరికీ నా అభినందనలు అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సివిల్ సర్వీసుల చరిత్రను, మహనీయుల సేవలను మోదీ గుర్తుచేసుకున్నారు. 1920లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఈ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. ఆనాడు బ్రిటిష్ పాలన ఉన్నప్పటికీ ఆయన సంస్కృతంలో పేపర్ రాశారని ఇక్కడి గ్యాలరీలో చూశాను. అదేవిధంగా, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశాన్ని నడపడంలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారు. స్వతంత్ర భారతానికి అవసరమైన 'ఉక్కు చట్రాన్ని' (స్టీల్ ఫ్రేమ్) సర్దార్ పటేల్ అందించారు. ఈ సంస్థను దేశానికి ఒక ప్రధాన స్తంభంగా తీర్చిదిద్దారు అని మోదీ వివరించారు. 1926 అక్టోబర్ 1న పబ్లిక్ సర్వీస్ కమిషన్‌గా ప్రారంభమైన ఈ సంస్థ, శతాబ్ద కాలంలో ఎన్నో మార్పులకు లోనై స్వతంత్ర రాజ్యాంగబద్ధ సంస్థగా రూపుదిద్దుకుందని ప్రధాని గుర్తుచేశారు. గతేడాది అక్టోబర్ 1న ప్రారంభమైన శతాబ్ది ఉత్సవాలు ఈ కార్యక్రమంతో ముగిశాయి. సెప్టెంబర్ 30, అక్టోబర్ 1న రెండు రోజుల పాటు జరిగిన ఈ వేడుకల్లో వివిధ రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ల చైర్మన్లు, సభ్యులు, అధికారులు, పాల్గొన్నారు.

ఖైరతాబాద్ ఉప ఎన్నికకు బ్రేక్

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించరాదని ఆమె తరపు సీనియర్ న్యాయవాది వేదుల వెంకటరమణ వాదించారు. ఇందుకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పులు, ప్రజాప్రాతినిధ్య చట్టంలోని నిబంధనలను ఆయన ప్రస్తావించారు.

ఈసీ అఫిడవిట్ దాఖలు చేయాలి

వాదనలు విన్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ వకటి రామకృష్ణారెడ్డి ధర్మాసనం.. ఖైరతాబాద్ ఉప ఎన్నిక నిర్వహణపై ఈసీ తన వైఖరిని స్పష్టం చేస్తూ సమగ్ర అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. కేసు తదుపరి విచారణను అక్టోబర్ 6కు వాయిదా వేసింది. ఈసీ హామీని అధికారికంగా రికార్డుల్లోకి తీసుకునే ప్రక్రియ కొనసాగనుంది. 2023లో బీఆర్ఎస్ తరపున ఖైరతాబాద్ నుంచి గెలిచిన దానం నాగేందర్ అనంతరం కాంగ్రెస్‌లో చేరి సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేశారు. పార్టీ ఫిరాయింపులకు సంబంధించిన కేసులో తెలంగాణ హైకోర్టు ఆయనను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించడంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయింది. సెప్టెంబర్ 18న హైకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో ఈ ఖాళీ ఏర్పడింది. దీంతో ఖైరతాబాద్ ఉప ఎన్నిక ఎప్పుడు జరుగుతుందనే అంశం ఇప్పుడు పెండింగ్ ఎన్నికల పిటిషన్ తుది పరిష్కారంపైనే ఆధారపడి ఉంది.

సర్ పొడిగింపు లేదు



ప్రజానావ, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)లో భాగంగా 92 లక్షల మందికి నోటీసులు ఇచ్చినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 80 వేల మందికి నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. వారిలో 20 శాతం మంది సమాధానం ఇచ్చారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 92 లక్షల మందిలో 65 లక్షల మంది నోటీసులపై స్పందించినట్లు చెప్పారు. నోటీసులు అందిన వారి ఇళ్ల వద్దకు బీఎల్ఓలు వెళ్లి సంబంధిత పత్రాలను తీసుకుంటున్నారని పేర్కొన్నారు. నోటీసులు అందిన కుటుంబ సభ్యులు అందరూ అందుబాటులో ఉండవల్సిన అవసరం లేదని, ఒక్కరు ఉండి, మిగిలిన అందరి కుటుంబ సభ్యుల వివరాలు ఇస్తే సరిపోతుందని అన్నారు. సర్ ప్రక్రియను మరోసారి పొడిగించే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు.

ఎన్నికల కమిషన్ కార్యాలయం తగలబడిపోతది

హైదరాబాద్‌లో మాత్రం మామూలుగా ఉండదు

• ఓట్లు పునరుద్ధరించకుంటే ఊరుకునేదే లేదు • దానం నాగేందర్ వివాదాస్పద వ్యాఖ్యలు



ప్రజానావ, హైదరాబాద్: సర్‌లో భాగంగా ఖైరతాబాద్‌లో తీసేసిన ఓట్లు తిరిగి పునరుద్ధరించకుంటే ఊరుకోనేది లేదని దానం హెచ్చరించారు. హైదరాబాద్‌లో మాత్రం మామూలుగా ఉండదు.. తగలబడి పోతుందంటూ వ్యాఖ్యానించారు. సర్ ప్రక్రియలో భాగంగా తన నియోజకవర్గంలో 20 వేల ఓట్లను తొలగించారని దానం చెప్పారు. ఎస్ఐఆర్ గురించి రాహుల్ గాంధీ పదే పదే ఎందుకు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని, ఇప్పుడు మా నియోజకవర్గంలో ప్రత్యేకించి 20 వేల ఓట్లు ఇప్పటివరకు కట్ చేశారని చెప్పుకొచ్చారు. వారికి నోటీసులు ఇచ్చారని.. దాన్ని సరిచేయాలని డిమాండ్ చేశారు. ఇందులో చాలా మంది బీజేపీతో అనుబంధంగా.. ఎవరైతే ఏఎంసీలున్నారో.. ఏఆర్‌వోలున్నారో బీజేపీతో కుమ్మక్కై పెద్ద ఎత్తున ఓట్లు తొలగించే ప్రక్రియ చేపడుతున్నారని ఆరోపించారు. కమిషనర్‌కు ఫిర్యాదు చేసేందుకు వెళ్తున్నానని.. ఎవరైతే మా ఓట్లు తీయించే ప్రయత్నం జరుగుతున్నదో వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఓటు చోరీ నుంచి ప్రజలను కాపాడాల్సిన బాధ్యత తమ పై ఉందన్నారు. ఇప్పటిదాకా డిలీట్ చేసిన ఓట్లను మళ్లీ పరిగణలోకి తీసుకొని అందరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. కాగా.. ఉప ఎన్నిక ప్రక్రియ ప్రారంభం వేళ దానం చేసిన ఈ వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. కాగా దానం పై న్యాయస్థానం అనర్హత వేటు తో ఖైరతాబాద్ ఉప ఎన్నిక ఖాయమైంది. ఇప్పటికే ఈ మేరకు నోటిఫికేషన్ జారీ అయింది. త్వరలో ఎన్నికల సంఘం ఉప ఎన్నిక షెడ్యూల్ ప్రకటించనుంది. కాగా.. ఉప ఎన్నిక వేళ కాంగ్రెస్ మహిళా నేత విజయా రెడ్డి హైకోర్టులో దాఖలు చేసిన పిటీషన్ సంచలనంగా మారింది. ఇక.. ఇటు దానం నాగేందర్ సర్ ప్రక్రియలో భాగంగా ఖైరతాబాద్ లో తొలిగించిన ఓట్ల పైన దానం నాగేందర్ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. ఖైరతాబాద్ ఉప ఎన్నిక చుట్టూ ప్రస్తుతం రాష్ట్ర రాజకీయం నడుస్తోంది. ఇప్పటికే ఉప ఎన్నిక ఖాయం కావటంతో కాంగ్రెస్ నుంచి తిరిగి దానం నాగేందర్ పోటీ చేస్తారని చెబుతున్నారు. అదే విధంగా బీజేపీ, బీఆర్ఎస్ నుంచి అభ్యర్థులు దాదాపు ఖరారయ్యారు. ఇటు ఎన్నికల సంఘం త్వరలోనే ఈ ఉప ఎన్నిక కోసం షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. కాగా.. ఈ ఎన్నిక పైన అభ్యర్థిత్వం పైన కాంగ్రెస్ నుంచి విజయారెడ్డి– దానం మధ్య పోటీ నెలకొంది. విజయా రెడ్డి తాజాగా ఈ ఉప ఎన్నిక పైన హైకోర్టును ఆశ్రయించారు. కాగా.. ఇటు దానం చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి.

4న రాష్ట్రంలో అమిత్ షా పర్యటన

ప్రజానావ, హైదరాబాద్: తెలంగాణ కేంద్రంగా బీజేపీ కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా కొత్త వ్యూహాలను సిద్ధం చేస్తోంది. ఇప్పటికే పలువురు కేంద్ర మంత్రులు తెలంగాణలో వరుస పర్యటనలు చేస్తున్నారు. గ్రేటర్, ఖైరతాబాద్ ఉప ఎన్నికతో పాటుగా పంచాయితీ ఎన్నికలకు సిద్ధం అవుతున్న వేళ బీజేపీ నాయకత్వం కొత్త ప్రణాళికతో బరిలోకి దిగుతోంది. అందులో భాగంగా నేరుగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన ఆసక్తిగా మారుతోంది. తెలంగాణలో బీజేపీ ఈ సారి కొత్త వ్యూహాలను అమలు చేస్తోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా పావులు కదుపుతోంది. గ్రేటర్ ఎన్నికల్లో సత్తా చాటేందుకు బీజేపీ అగ్ర నాయకత్వం ఇప్పటికే పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేసింది. ఈ క్రమంలోనే కేంద్ర హోంమంత్రి అమిత్ షా అక్టోబర్ 4న తెలంగాణలో పర్యటించనున్నారు. అమిత్ షా పర్యటన కేవలం అధికారిక కార్యక్రమాలకే పరిమితం కాకుండా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలతో పాటుగా భవిష్యత్ వ్యూహాలకు కీలకంగా మారుతోంది. కాంగ్రెస్–బీఆరఎస్ లక్ష్యంగా అమిత్ షా తెలంగాణలో పార్టీ నేతలకు ఇప్పటికే దిశా నిర్దేశం చేసారు. కేంద్ర మంత్రులు తరచూ తెలంగాణలో పర్యటిస్తూ... ప్రత్యేకంగా తటస్థులతో మమేకం కావాలని పార్టీ ఆదేశించింది. కాగా, తెలంగాణలో పార్టీ కార్యాచరణ పైన ఢిల్లీలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, రాష్ట్ర నాయకత్వానికి ఇప్పటికే దిశానిర్దేశం చేశారు. తెలంగాణలో ఎన్నికల హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, ప్రజా వ్యతిరేకతను అనుకూలంగా మలుచుకోవడానికి సదక్ సే సదన్ తక కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ఈ పర్యటనలో అమిత్ షా కరీంనగర్, మెదక్ జిల్లాలలో పర్యటించనున్నారు. కరీంనగర్‌లోని ప్రతిమ కాలేజ్ లో జరిగే కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడమే ప్రధాన లక్ష్యంగా అమిత్ షా పర్యటన సాగనుంది ని పార్టీ నేతలు చెబుతున్నారు. అమిత్ షా పర్యటన ద్వారా పార్టీ క్యాడర్‌లో జోష్ నింపాలని, ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల్లోకి గట్టిగా తీసుకెళ్లాలని వ్యూహం సిద్ధం చేస్తున్నారు. దీంతో, అమిత్ షా పర్యటన పైన రాజకీయంగా ఆసక్తి నెలకొంది.

రాష్ట్రంలో చలి తక్కువే!

ప్రజానావ, హైదరాబాద్: నైరుతి రుతుపవనాల సీజన్ ముగియడంతో శీతాకాలానికి ముందు వాతావరణ పరిస్థితులపై భారత వాతావరణ శాఖ (ఐఎండీ) కీలక అంచనాలను వెల్లడించింది. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది చలి తీవ్రత సాధారణం కంటే తక్కువగా ఉండే అవకాశం ఉందని తెలిపింది. అక్టోబర్‌లో దేశవ్యాప్తంగా గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా నమోదయ్యే అవకాశ ముందని పేర్కొంది. అక్టోబర్–డిసెంబర్ మధ్య కాలంలో తెలంగాణలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించింది. జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు కొనసాగిన నైరుతి రుతుపవనాల సీజన్‌లో తెలంగాణకు సాధారణంగా 740.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 615.5 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది. దీంతో రాష్ట్రంలో 17 శాతం వర్షపాతం లోటు ఏర్పడింది. అయితే ఐఎండీ ప్రమాణాల ప్రకారం –19 శాతం నుంచి +19 శాతం మధ్య ఉన్న వర్షపాతాన్ని సాధారణ వర్షపాతంగా పరిగణిస్తారు. రాష్ట్రంలో 33 జిల్లాలకు గాను 18 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైంది. ఈ ఏడాది రుతు పవనాల సీజన్‌లో తెలంగాణపై ప్రభావం చూపే పలు అల్పపీడన వ్యవస్థలు ఏర్పడ్డాయి. వీటిలో కొన్ని వాయుగుండాలుగా బలపడి రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలకు కారణమయ్యాయి. ముఖ్యంగా ఉత్తర, ఈశాన్య తెలంగాణ జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు నమోదయ్యాయి. ఈ వాతావరణ వ్యవస్థల కారణంగానే రాష్ట్రవ్యాప్తంగా వర్షపాతం లోటు మరింత పెరగకుండా కొంత మేర ఉపశమనం లభించినట్లు వాతావరణ శాఖ గణాంకాలు సూచిస్తున్నాయి.

అక్టోబర్‌లో ఎండలే

అక్టోబర్‌లో పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. దేశవ్యాప్తంగా అక్టోబర్‌లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశముందని తెలిపింది. తెలంగాణలోనూ అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉండొచ్చని పేర్కొంది. కేరళ అనంతరం తెలంగాణలోకి జూన్ 8న ప్రవేశించినప్పటికీ ప్రారంభంలో దక్షిణ తెలంగాణలోనే పరిమితమై, ఆ తర్వాత క్రమంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాయి. ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం లోటు నేపథ్యంలో రానున్న నెలల్లో ఉష్ణోగ్రతలు, వర్షపాతం పరిస్థితులను ప్రజలు, రైతులు నిశితంగా గమనించాల్సిన అవసరం ఉందని వాతావరణ పరిస్థితులు సూచిస్తున్నాయి.

ఎవరి ఆదేశాలతో ఫామ్–6లో మార్పులు?

• టీసీఎస్‌కు ఈసీ నుంచి ఎవరు సూచనలిచ్చారు? • సంస్థలో ఎవరు ఆమోదించారు

• కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ • ఎన్నికల కమిషనర్ల అభ్యంతరాల నేపథ్యంలో మళ్లీ తెరపైకి వివాదం



న్యూఢిల్లీ: కొత్త ఓటర్ల నమోదుకు ఉపయోగించే ఆన్‌లైన్ ఫామ్–6లో మార్పులు ఎవరి ఆదేశాలతో జరిగాయో వెల్లడించాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించారు. ఫామ్–6లో మార్పులు చేయాలని టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)కు ఎన్నికల సంఘంలో ఎవరు ఆదేశాలు ఇచ్చారని, టీసీఎస్‌లో ఆ మార్పులకు ఎవరు ఆమోదం తెలిపారని ఆయన నిలదీశారు. ఈ మార్పుల అమలుకు సంస్థపై ఏమైనా ఒత్తిడి తెచ్చారా? అని కూడా ప్రశ్నించారు. ఎక్స్ వేదికగా ఆయన ఈ ప్రశ్నలు సంధించారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్)కు సంబంధించిన అదనపు డిక్లరేషన్‌ను ఆన్‌లైన్ ఫామ్–6లో చేర్చడంపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు నివేదికలు వెల్లడించాయి. ఫామ్–6 చట్టబద్ధమైన ఫారమ్ కావడంతో దానిలో మార్పులు చేయడంపై వారు ప్రశ్నలు లేవనెత్తినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే ఫామ్–6 మార్పులపై రాహుల్ గాంధీ ప్రశ్నలు సంధించారు.

కొన్ని రాష్ట్రాల్లో మార్పు ఉపసంహరణ

వివాదానికి కేంద్రంగా మారిన ఎస్ఐఆర్ సంబంధిత అదనపు డిక్లరేషన్‌ను ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయిన రాష్ట్రాల్లో ఈసీ తొలగించింది. సెప్టెంబర్ 26న జరిగిన పూర్తిస్థాయి ఎన్నికల సంఘం సమావేశంలో ఫామ్–6లో ఎస్ఐఆర్ కాలంలోనూ, సాధారణ కాలంలోనూ మార్పు ఉండకూడదని నిర్ణయించినట్లు నివేదికలు పేర్కొన్నాయి. ఇదిలాఉంటే ఓటర్ల జాబితాల సవరణ, ఎస్ఐఆర్ ప్రక్రియపై విపక్షాలు ఆందోళనలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఫామ్–6 అంశం మరోసారి రాజకీయ చర్చకు దారితీసింది. ఇండియా కూటమి నేతలు ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అంశాలపై సంయుక్త ఆందోళనలకు పిలుపునిచ్చారు. అక్టోబర్ 6న విపక్ష ఎంపీలు ఎన్నికల సంఘం కార్యాలయం వరకు మార్చ్ నిర్వహించాలని నిర్ణయించారు.

భిన్నాభిప్రాయాలు సహజమే: ఈసీ

ఎస్ఐఆర్‌కు సంబంధించిన కొన్ని నిర్ణయాలు, ఉత్తర్వులపై ఎన్నికల కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వచ్చిన వార్తలపై ఎన్నికల సంఘం స్పందిస్తూ.. సంస్థాగత చర్చల్లో భిన్నాభిప్రాయాలు, సూచనలు ఉండటం సహజమేనని పేర్కొంది. తమ ఉత్తర్వులన్నీ చట్టబద్ధమైనవేనని, నిర్దేశిత చట్టపరమైన ప్రక్రియను అనుసరించే జారీ చేశామని స్పష్టం చేసింది.

ఆస్తులపై విచారణకు సిద్ధమా?

(మొదటిపేజీ తరువాయి)

కోరారు. సిరిసిల్ల పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి తన కుటుంబ ఆస్తులపై చేసిన వ్యాఖ్యలకు కేటీఆర్ స్పందించారు. తాను 2006లోనే హోటల్ వ్యాపారం ప్రారంభించానని, ప్రస్తుతం మూడు హోటళ్లు ఉన్నాయని తెలిపారు. తన ఆస్తులు, వ్య



చెప్పిన మాటను ఆచరించిన మహాత్ముడు

- గాంధీజీ భావజాలంపై విద్యార్థులకు అవగాహన
- ఎక్స్‌టెన్షన్ లెక్చర్‌లో అధ్యాపకురాలు ఆఫ్రీన్ సుల్తానా

ప్రజానావ, నిర్మల్: మహాత్మా గాంధీ తాను చెప్పిన మాటను ఆచరించి చూపించిన మహనీయుడని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ అతిక్ బేగం అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాలలో పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో 'గాంధీజీ భావజాలం'పై ఎక్స్‌టెన్షన్ లెక్చర్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన అధ్యాపకురాలు ఆఫ్రీన్ సుల్తానా గాంధీజీ భావజాలం, సిద్ధాంతాలను విద్యార్థులకు విస్తృతంగా వివరించి అవగాహన కల్పించారు. గాంధీజీ ఆలోచనలు, సిద్ధాంతాల ప్రాధాన్యాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ముబారక్, శ్రీనివాస్, స్వామి, సంజూ, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రీడా ఎంపిక పోటీలు

- చదరంగం, క్రికెట్, బేస్‌బాల్‌లో ప్రతిభకు అవకాశం
- క్రీడాకారులు సకాలంలో హాజరుకావాలి

ప్రజానావ, ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణంలో పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో అండర్–14, అండర్–17 విభాగాల్లో జిల్లా స్థాయి చదరంగం, బేస్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు డీఈఓ మాధవి, సమాఖ్య జిల్లా కార్యదర్శి ఆడే రామేశ్వర్ తెలిపారు. చదరంగం పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తమ వెంట చదరంగం బోర్డు తీసుకురావాలని సూచించారు. పోటీలకు సంబంధించిన వివరాల కోసం నిర్వాహకులు విట్టల్‌రెడ్డి, నాందేవ్‌లను సంప్రదించాలని తెలిపారు. ఇదే క్రీడా ప్రాంగణంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో అండర్–17 బాలికల జిల్లా స్థాయి క్రికెట్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. క్రికెట్ పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు ఉదయం 10.30 గంటలకు పీడీ సాయికుమార్ వద్ద రిపోర్టు చేయాలని సూచించారు. అలాగే అండర్–14, అండర్–17 బాలబాలికల జిల్లా స్థాయి బేస్‌బాల్ ఎంపిక పోటీలు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. బేస్‌బాల్ పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు ఉదయం 10.30 గంటలకు పీడీ హరిచరణ్ వద్ద రిపోర్టు చేయాలని అధికారులు సూచించారు.

యాసంగిలో వరికి బదులు ఆరుతడి పంటలు

నూనెగింజలు, పప్పుదినుసుల సాగుతో నీటి వనరుల సమర్థ వినియోగం

ప్రజానావ, మెదక్: యాసంగి సీజన్‌లో వరి సాగుకు ప్రత్యామ్నాయంగా ఆరుతడి, నూనెగింజలు, పప్పుదినుసుల పంటలను సాగు చేయాలని కేవీకే తుని శాస్త్రవేత్త డా. ఎం. ఉదయ్‌కుమార్ రైతులకు సూచించారు. పాపన్నపేట మండలం చీకోడ్ గ్రామంలో ఆత్మ (వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ) సౌజన్యంతో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డా. ఎం. ఉదయ్‌కుమార్ సేంద్రియ వ్యవసాయ విధానాలు, జీవ ఎరువుల వినియోగం, వాటి ప్రయోజనాలను వివరించారు. నానో యూరియా, నానో డీఏపీ, ఆర్గానిక్ కార్బన్, సేంద్రియ కర్బనం వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. యాసంగిలో సాగు చేయాల్సిన పంటల ఎంపికపై పలు సూచనలు చేశారు. మండల వ్యవసాయ అధికారి పి. శ్రీనివాసరాజు మాట్లాడుతూ నీటి వనరులను సమర్థంగా వినియోగించుకునేందుకు వరికి బదులుగా ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. నూనెగింజలు, పప్పుదినుసుల సాగుపై రైతులు ఆసక్తి చూపాలని కోరారు. ఒక ఎకరం వరి సాగుకు అవసరమయ్యే నీటితో రెండు నుంచి మూడు ఎకరాల వరకు ఆరుతడి పంటలు సాగు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చీకోడ్ చైర్మన్ సిద్ధంశెట్టి దత్తరాజు, సీఈఓ పి. ప్రశాంత్‌తో పాటు వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై అవగాహనతో పరిశుభ్ర గ్రామాలుగా తీర్చిదిద్దాలి

- ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి స్టీల్ పాత్రలు వాడాలి
- పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు, సన్మానం

ప్రజానావ, హన్మకొండ: గ్రామాల్లో పారిశుధ్య చర్యలను నిరంతరం కొనసాగిస్తూ స్వచ్ఛత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హన్మకొండ ఇన్‌చార్జి ఎంపీడీవో యూసుఫ్ సూచించారు. గురువారం హన్మకొండలో స్వచ్ఛత ఈ సేవ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, పారిశుధ్య కార్మికులకు పారిశుధ్య చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యూసుఫ్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని తగ్గించి స్టీల్ పాత్రలను వినియోగించాలని సూచించారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్య చర్యలు చేపడుతూ ఇంటి పరిసరాలు, గ్రామ పురవీధులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. అనంతరం గ్రామాల్లో పారిశుధ్య సేవలు అందిస్తున్న కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌బీఎం కోఆర్డినేటర్ స్వామి, ఏపీఓ ప్రవీణ్ పాల్గొన్నారు.

ముగిసిన మల్లేశ్ కస్టడీ

- 10 రోజుల పాటు విచారణ
- వైద్య పరీక్షల అనంతరం కోర్టులో హాజరు
- చంచల్‌గూడ జైలుకు తరలింపు



ప్రజానావ, హైదరాబాద్: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మద్రాస్ రెజిమెంట్ ఆర్మీ ఆయుధాల చోరీ కేసులో నిందితుడు మల్లేశ్ పోలీసు కస్టడీ ముగిసింది. సెప్టెంబరు 22 నుంచి 10 రోజుల పాటు మల్లేశ్‌ను బొల్లారం పోలీసులు విచారించారు. కస్టడీ ముగియడంతో వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం గురువారం సాయంత్రం సికింద్రాబాద్ కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు మల్లేశ్‌ను చంచల్‌గూడ జైలుకు తరలించారు. కస్టడీ విచారణలో భాగంగా నిందితుడి నుంచి పోలీసులు కీలక సమాచారాన్ని రాబట్టినట్లు తెలుస్తోంది. కేసు దర్యాప్తులో మరింత సమాచారం సేకరించేందుకు మల్లేశ్‌ను పోలీసులు మరోసారి కస్టడీకి కోరే అవకాశం ఉన్నట్లు సమాచారం.

అక్రమ లేఅవుట్‌కు అధికారుల అండ?

- ప్లాటు ఇస్తే సమస్య లేకుండా చూస్తానంటూ మున్సిపల్ అధికారిపై ఆరోపణలు
- నిర్మాణ అనుమతుల్లోనూ నిబంధనల ఉల్లంఘన ఆరోపణలు



ప్రజానావ, హైదరాబాద్: గంధంగూడలో వెలిసిన అక్రమ లేఅవుట్ వ్యవహారం రాజేంద్రనగర్ సర్కిల్‌లో చర్చనీయాంశంగా మారింది. అక్రమంగా లేఅవుట్ వేస్తున్న వారిని నిలువరించాల్సిన మున్సిపల్ అధికారి.. 'ఓ ప్లాటు ఇస్తే సమస్య లేకుండా చూస్తా' అంటూ లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదరు అధికారి అక్రమ లేఅవుట్‌కు అండగా నిలవడంతోపాటు ఎల్‌ఆర్ఎస్–2020 నిబంధనలకు విరుద్ధంగా సర్కిల్ కార్యాలయం లేఅవుట్‌లోని రెండు ప్లాట్లకు నిర్మాణ అనుమతులు సైతం మంజూరు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. లేఅవుట్ నిబంధనల ప్రకారం హైటెన్షన్ విద్యుత్ లైన్ల కింద కనీసం 100 అడుగుల రహదారి వదలాల్సి ఉండగా, గంధంగూడలోని లేఅవుట్‌లో విద్యుత్ తీగల వరకు కేవలం 40 అడుగుల మేర రహదారి వదిలినట్లు ఆరోపణలు వస్తున్నాయి. హైటెన్షన్ లైన్లలో అధిక వోల్టేజ్ విద్యుత్ ప్రసారం అవుతుండటంతో వాటికి సమీపంలో నిర్మాణాలు, రాకపోకలు ప్రమాదకరంగా ఉండే అవకాశం ఉందని, ఎత్తైన వాహనాల రాకపోకలకు సైతం ఇబ్బందులు తలెత్తుతాయని నిబంధనల ప్రకారం విస్తృత రహదారి ఏర్పాటు చేస్తారని స్థానికులు పేర్కొంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా తక్కువ స్థలాన్ని రహదారికి కేటాయించడం ద్వారా స్థిరాస్తి సంస్థ ఎక్కువ భూమిని ప్లాట్లుగా విక్రయించి లాభపడేందుకు ప్రయత్నించిందన్న ఆరోపణలు ఉన్నాయి. దీనివల్ల అనుమతుల రూపంలో ప్రభుత్వ ఆదాయానికి కూడా నష్టం వాటిల్లే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. మరోవైపు ఎల్‌ఆర్ఎస్–2020 నిబంధనల ప్రకారం ఆగస్టు 2020 నాటికి ముందే రిజిస్ట్రేషన్ పూర్తయిన ఇళ్ల స్థలాలకు మాత్రమే జరిమానాతో నిర్మాణ అనుమతులు మంజూరు చేయాల్సి ఉండగా, రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులు ఆ తర్వాత జరిగిన కొనుగోలు ఒప్పంద పత్రాల ఆధారంగానూ అనుమతులు ఇస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా సర్కిల్ అధికారిపై వస్తున్న ఆరోపణలు అక్రమ లేఅవుట్ వరకే పరిమితం కాలేదని స్థానికులు చెబుతున్నారు. అక్రమ వసూళ్ల కోసం ఓ వ్యక్తిని మధ్యవర్తిగా ఉపయోగిస్తున్నారని, అక్రమ నిర్మాణాల వద్దకు సదరు వ్యక్తి వెళ్లి అధికారి పేరు చెప్పి లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గంధంగూడ సర్వే నంబర్ 38–ఏలో సుమారు నాలుగు ఎకరాల విస్తీర్ణంలో వెలిసిన లేఅవుట్ వ్యవహారంలోనూ ఇదే తరహా వసూళ్ల ఆరోపణలు తెరపైకి వచ్చాయి. ఇతరుల పేరుతో లేఅవుట్‌లోని ఓ పెద్ద ప్లాటును అధికారికి కేటాయించేలా మధ్యవర్తి స్థిరాస్తి సంస్థను ఒప్పించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా లేఅవుట్‌లోని ప్లాట్లకు మంజూరు చేసే ప్రతి నిర్మాణ అనుమతికి రూ.2 లక్షల చొప్పున చెల్లించేలా ఒప్పందం కుదిరినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బడా హోటళ్లు, రెస్టారెంట్ల నుంచి సైతం నెలవారీ మామూళ్లు వసూలు చేస్తున్నారని, చెల్లించకపోతే సదరు మధ్యవర్తి ఆయా సంస్థలపై ఫిర్యాదులు చేస్తాడన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

భూ వివాదంపై బీఆర్ఎస్ పోరుబాట

- ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌పై కార్తీక్‌రెడ్డి విమర్శలు
- 2013 భూసేకరణ చట్టం ప్రకారం రైతులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని డిమాండ్



ప్రజానావ, హైదరాబాద్: బహదూర్‌గూడ భూ వివాదం మరోసారి రాజకీయంగా వేడెక్కింది. భూ సమస్యలపై బీఆర్ఎస్ నేత కార్తీక్‌రెడ్డి స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌పై తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో బాధితులతో సమావేశం నిర్వహించిన అనంతరం స్థానిక నాయకులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రాజేంద్ర నగర్ నియోజకవర్గం నుంచి ప్రకాశ్‌గౌడ్ నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటికీ బహదూర్‌గూడతో పాటు పలు ప్రాంతాల్లోని భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపలేదని కార్తీక్‌రెడ్డి ఆరోపించారు. ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం, అనంతరం సమస్యలను పట్టించుకోకపోవడం పరిపాటిగా మారిందని విమర్శించారు. గాజిగూడ, హన్మాన్‌నగర్, మదన్‌పల్లి, కొత్వాల్‌గూడ, నరుకుడ, మల్కారం ప్రాంతాల్లో భూ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎమ్మెల్యేకు సంబంధించిన నిర్మాణాల విషయంలో శ్రద్ధ చూపుతున్నారని, అదే ప్రాంతాల్లో పేదలు ఎదుర్కొంటున్న భూ, ఇళ్ల స్థలాల సమస్యల పరిష్కారంపై ఎందుకు దృష్టి పెట్టడం లేదని ప్రశ్నించారు. భూసేకరణ విషయంలో 2013 భూసేకరణ చట్టం ప్రకారం అర్హులైన రైతులకు న్యాయమైన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఆయా గ్రామాల్లో రైతులే లేరన్నట్లుగా మాట్లాడటం రైతులు, గ్రామస్థులను అవమానించడమేనన్నారు. తమ భూముల కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న వారిపై కేసులు నమోదు చేయడం సరికాదని విమర్శించారు. బాధిత రైతుల తరపున న్యాయస్థానాల్లో, అసెంబ్లీలో, ప్రజాక్షేత్రంలో పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తే బహదూర్‌గూడ భూ సమస్యను పరిష్కరించడంతోపాటు అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతుల భూముల విషయంలో చట్టాన్ని ఉల్లంఘించకుండా ప్రభుత్వం వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో బహదూర్‌గూడ భూ వివాదంపై ప్రభుత్వం, రెవెన్యూ యంత్రాంగం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని స్థానికులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

కొత్త రూపంలో మెక్‌డొవెల్స్ నెం.1

- 125 ఏళ్ల చరిత్రలో కీలక మార్పు
- మెరుగైన బ్లెండ్, అదనపు స్కాచ్‌తో కొత్త ప్రీమియం గుర్తింపు

న్యూఢిల్లీ: భారతదేశంలోని ప్రముఖ విస్కీ బ్రాండ్‌లలో ఒకటైన మెక్‌డొవెల్స్ నెం.1ను డియాజియో ఇండియా కొత్త తరం వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా సరికొత్త రూపంలో ఆవిష్కరించింది. బ్రాండ్ 125 ఏళ్ల చరిత్రలో చేపట్టిన ఈ పునరావిష్కరణ కేవలం ప్యాకేజింగ్ మార్పుకే పరిమితం కాకుండా మెరుగైన బ్లెండ్, అదనపు స్కాచ్, కొత్త ప్రీమియం గుర్తింపును జతచేసింది. ఎంపిక చేసిన దిగుమతి స్కాచ్, భారతీయ మాల్ట్‌లు, ప్రీమియం గ్రెయిన్ స్పిరిట్‌లను కలిపి, ఓక్, అమెరికన్ బ్యారెల్స్‌లో పక్వానికి తెచ్చిన ఈ విస్కీని భారత్, స్కాట్లాండ్‌లలో మిళితం చేసినట్లు సంస్థ తెలిపింది. 100కు పైగా నాణ్యతా తనిఖీల అనంతరం దీనిని ధ్రువీకరించినట్లు పేర్కొంది. వెనీలా, సున్నితమైన ధాన్యపు తీపి, మృదువైన మాల్ట్ సువాసనలతో పాటు రుచిలో స్వచ్ఛమైన, మృదువైన ముగింపు ఉంటుందని వెల్లడించింది. పునఃరూపకల్పన చేసిన బాటిల్, సమకాలీన దృశ్య గుర్తింపుతో బ్రాండ్‌కు మరింత ప్రీమియం రూపాన్ని తీసుకొచ్చినట్లు తెలిపింది. ఈ సందర్భంగా డియాజియో ఇండియా చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ రుచిరా జైట్లీ మాట్లాడుతూ.. నేటి విస్కీ వినియోగదారులు విలువను కేవలం అందుబాటు ధరతో కాకుండా నాణ్యత, నైపుణ్యం, అనుభవంతో ముడిపెడుతున్నారని అన్నారు. 11 మార్కెట్లలో 10 వేల మందికి పైగా వినియోగదారులపై నిర్వహించిన అధ్యయనాల ద్వారా ఈ అంతర్దృష్టులను ధ్రువీకరించినట్లు తెలిపారు. దశాబ్దాలుగా సంపాదించుకున్న విశ్వాసం, పరిచయం, నాయకత్వాన్ని కొనసాగిస్తూనే కొత్త తరానికి అనుగుణంగా బ్రాండ్‌ను అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. ఇది కేవలం పునఃప్రారంభం కాదని, భారత మాస్ ప్రీమియం విస్కీ విభాగ భవిష్యత్తుకు నమూనాగా నిలుస్తుందని చెప్పారు. ఏటా 3 కోట్లకు పైగా కేసులు విక్రయించే మెక్‌డొవెల్స్ నెం.1లో చేపట్టిన ఈ మార్పు భారతీయ విస్కీ విభాగంలో కీలక పరిణామమని సంస్థ పేర్కొంది. వినియోగదారుల ప్రాధాన్యతలు ధర నుంచి నాణ్యత, నైపుణ్యం, అనుభవం వైపు మారుతున్న నేపథ్యంలో మాస్ ప్రీమియం విభాగాన్ని కొత్తగా నిర్వచించడమే లక్ష్యమని, అదే సమయంలో అందుబాటు, సమ్మిళితత్వానికి ప్రాధాన్యం కొనసాగుతుందని తెలిపింది.

స్పెషల్ ఎడ్యుకేటర్లకు దరఖాస్తుల ఆహ్వానం


ప్రజానావ, వేములవాడ: పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ హన్మాజిపేట పాఠశాలలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల కోసం స్పెషల్ గెస్ట్ ఎడ్యుకేటర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ శ్రీకాంత్‌రావు తెలిపారు. స్పెషల్ బీఈడీ చేసిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు అక్టోబర్ 3 నుంచి 10వ తేదీ వరకు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన వారికి నెలకు రూ.16,500 వేతనం అందజేయనున్నట్లు తెలిపారు.

చిన్నారిపై లైంగిక దాడి.. వృద్ధుడికి జీవితఖైదు



ప్రజానావ, హైదరాబాద్: నాలుగేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో 76 ఏళ్ల వృద్ధుడికి నాంపల్లి కోర్టు జీవితఖైదు విధించింది. గోల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్న జి. నారాయణ అదే ప్రాంతానికి చెందిన నాలుగేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు కేసు నమోదైంది. ఘటనపై బాలిక తల్లి ఫిర్యాదు చేయడంతో గోల్కొండ పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం ఛార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో నిందితుడిపై నేరం రుజువు కావడంతో నాంపల్లి కోర్టు జీవితఖైదుతో పాటు రూ.25 వేల జరిమానా విధిస్తూ గురువారం తీర్పు వెలువరించింది. బాధితురాలికి రూ.2 లక్షల పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించింది.





కాలనీల్లో మౌలిక వసతులే లక్ష్యం

- రూ.1.16 కోట్లతో సీసీ రోడ్లకు శంకుస్థాపన
- ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలే ధ్యేయం
- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

ప్రజానావ, హైదరాబాద్ : ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడమే ప్రధాన లక్ష్యమని బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ డివిజన్‌లోని పలు కాలనీల్లో దాదాపు రూ.1.16 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మౌలిక వసతుల అభివృద్ధితోనే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు నియోజకవర్గం సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ఇప్పటికే కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు కాలనీల్లో కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామని, రానున్న రోజుల్లో అన్ని డివిజన్లలో మౌలిక వసతులు కల్పించి మరింత అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. పద్మానగర్ ఫేజ్–2లో రూ.77.20 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు దేవరకొండ శ్రీనివాస్, వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మల్లారెడ్డి, శ్రీనివాస్ జైన్, నాగేశ్వర రావు, దుర్గారెడ్డి, కేవీఏఎన్ చారి, సంజయ్, శోభన్, గణేష్, వీరేశ్, ఆంజనేయులు, షఫీ, భాస్కర్‌గౌడ్, బ్రహ్మం, రాజన్న, కుమార్, రాంబాబు, మురళి, విశ్వనాథ్, పాపయ్య, పిలాయి రమేష్, సుబ్బారావు పాల్గొన్నారు. అనంతరం పద్మానగర్ ఫేజ్–1లో కాలనీ అభివృద్ధిలో భాగంగా రూ.28 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సత్తిరెడ్డి, ప్రధాన కార్యదర్శి దేవేందర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ దయాకర్, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీలు రమణారెడ్డి, నరసింహారెడ్డి, బాంబే శీను, ముత్యాలు, నాగిరెడ్డి, కాసింపీరా, వేణు, సురేందర్‌రెడ్డి, సంగమేశ్వరరావు, రంగా సుబ్బయ్య, వినోద్‌కుమార్, రాములు నాయక్, విజయ్‌సారథి పాల్గొన్నారు. అలాగే ఎన్టీఆర్ నగర్‌లో రూ.11 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ నగర్ అధ్యక్షుడు భాస్కర్, ప్రధాన కార్యదర్శి వెంకటరావు, కోశాధికారి వీరేశం, కాలనీవాసులు నరసింహారెడ్డి, చంద్రముని, మాజీ కౌన్సిలర్ సూర్యప్రభ, నియోజకవర్గ యువజన అధ్యక్షుడు దూదిమెట్ల సోమేశ్ యాదవ్, సీనియర్ నాయకులు కిషోర్‌చారి, నార్లకంటి బాలయ్య, యాదగిరి బాపు, వనం శ్రీను, ఎండీ నసీరుద్దీన్, ఆంజనేయులు, వెంకటేష్, అజయ్, నాగేష్, యాదగిరి, డీజే రమేష్, జయం చారి, శౌరిరాజ్, శివ్‌రాజ్, సతీష్, కేదార్‌నాథ్, వైద్యనాథ్‌తో పాటు స్థానిక కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి స్థలాలపై కబ్జాదారుల కన్ను

- వందల ఎకరాల ఖాళీ భూములు
- చాటుమాటుగా నిర్మాణాలు
- రక్షణ సిబ్బంది, అధికారుల తీరుపై ఆరోపణలు



ప్రజానావ, బెల్లంపల్లి: బొగ్గు గనుల కార్యకలాపాలు లేకపోవడంతో బెల్లంపల్లి ప్రాంతంపై సింగరేణి సంస్థ నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సంస్థకు విలువైన భూములతో పాటు క్వార్టర్లు ఉన్నప్పటికీ వాటి పరిరక్షణపై అధికారులు పెద్దగా దృష్టి సారించడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికే పట్టణంలోని పలు బస్తీల్లో కొన్ని క్వార్టర్లను ప్రభుత్వం స్వాధీనం చేసుకోగా, సింగరేణికి చెందిన ఖాళీ స్థలాలు మాత్రం ఇప్పటికీ వందల ఎకరాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్న కబ్జాదారులు సింగరేణి స్థలాలనూ వదలడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. పరిస్థితి ఇంత తీవ్రంగా ఉన్నప్పటికీ రక్షణ సిబ్బంది పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కబ్జాలు, అక్రమ నిర్మాణాలు అధికారుల దృష్టికి తెలిసే జరుగుతున్నాయన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. పట్టణంలోని బెల్లంపల్లి బస్తీలో సింగరేణికి అత్యంత విలువైన ఖాళీ స్థలాలు ఉన్నాయి. పాత జీఎం కార్యాలయం నుంచి ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లే రహదారి పక్కన ఉన్న సంస్థ స్థలంపై కబ్జాదారులు కన్నేసి నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రోడ్డుపై నుంచి కనిపించ కుండా పునాదులు తవ్వించి, ఇనుక, బండరాయిని తరలించి చాటుమాటుగా నిర్మాణాలకు సిద్ధమవుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఇదే ప్రాంతంలోని పలు ఖాళీ స్థలాల్లో ఇప్పటికే అక్రమంగా ఇళ్లు నిర్మించారని, ఒక్కో నిర్మాణానికి రూ.వేలల్లో వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలోనూ ఇళ్ల నిర్మాణాల సమయంలో సింగరేణి అధికారులు పట్టించు కోలేదని, ప్రస్తుతం కూడా అదే పరిస్థితి కొనసాగుతోందని స్థానికులు అంటున్నారు. సింగరేణికి చెందిన ఖాళీ స్థలాలను మున్సిపాలిటీకి అప్పగిస్తే ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి ఉపయోగపడటంతో పాటు ప్రజలకు మౌలిక వసతులు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. ఖాళీ స్థలాల చుట్టూ కంచె ఏర్పాటు చేసి పరిరక్షించాలని, పాత స్టోర్ స్థలంలో బృహత్ ఉద్యానవనం ఏర్పాటు చేయవచ్చని, రోడ్డుకు ఇరువైపులా షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మిస్తే పట్టణాభి వృద్ధికి ఉపయోగపడుతుందని సూచిస్తున్నారు. సింగరేణికి బెల్లంపల్లి బస్తీ, బూదిదగడ్డ బస్తీ, టేకుల బస్తీ, కన్నాల బస్తీ, హనుమాన్ బస్తీ, రామాలయం ఏరియా, మహ్మద్ ఖాసీం బస్తీ, స్టేషన్ రోడ్ కాలనీలతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ ఖాళీ స్థలాలు ఉన్నాయి. మహ్మద్ ఖాసీం బస్తీలో సౌత్‌క్రాస్ కట్ గని చుట్టుపక్కల స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినప్పటికీ సింగరేణి అధికారులు చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అడపాదడపా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా కబ్జాదారులు వాటిని తొలగించి మరీ ఆక్రమణలకు పాల్పడుతున్నారని చెబుతున్నారు. బెల్లంపల్లి బస్తీలోని పాత స్టోర్ ప్రాంతంలో సుమారు 60 ఎకరాల వరకు ఖాళీ స్థలం ఉన్నట్లు తెలుస్తోంది. పాత సీఎస్‌పీ, పవర్‌హౌస్ స్థలాలు కూడా ఖాళీగా ఉన్నాయి. వీటిని అధికారులు కాపాడకపోతే భవిష్యత్‌లో కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సింగరేణి కార్యక లాపాలు పెద్దగా లేకపోవడంతో ఖాళీ స్థలాలపై అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడిందని, ఆక్రమణలపై ఫిర్యాదులు చేసినా ఆశించిన స్థాయిలో చర్యలు కనిపించడం లేదని వారు పేర్కొంటున్నారు.



ఇంట్లో నాగుపాము.. గంటకుపైగా పడగవిప్పి

బెడ్‌రూమ్‌లో తిష్ఠ.. ఇంట్లో ఉన్నవారికి తీవ్ర భయాందోళన

ప్రజానావ, శివ్వంపేట: మెదక్ జిల్లా శివ్వంపేట మండలం నవాబ్‌పేట గ్రామంలో ఇంట్లోకి నాగుపాము రావడంతో కలకలం రేగింది. గ్రామానికి చెందిన సత్యనారాయణ ఇంట్లోకి గురువారం మధ్యాహ్నం నాగుపాము ప్రవేశించి బెడ్‌రూమ్‌లో సంచరించింది. కుటుంబసభ్యులు ఇంట్లోనే ఉన్న సమయంలో పాము పడగ విప్పి గంటకుపైగా అక్కడే ఉండటంతో తీవ్ర భయాందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని పామును చూసేందుకు గుమిగూడారు. ఇంట్లో నాగుపాము పడగ విప్పిన దృశ్యాలను కొందరు చిత్రీకరించగా.. అవి సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.<

మంటల్లో దగ్ధమైన ద్విచక్ర వాహనం

- అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం
- బోరు నీటితో మంటలు అదుపు



ప్రజానావ, శివ్వంపేట: మెదక్ జిల్లా శివ్వంపేట మండలం లచ్చిరెడ్డి గూడెం వద్ద ద్విచక్ర వాహనం అకస్మాత్తుగా మంటల్లో చిక్కుకుని పూర్తిగా దగ్ధమైంది. మండలంలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన సాయిరాంరెడ్డి, యశ్వంత్‌రెడ్డి బైక్‌పై హైదరాబాద్‌కు బయలుదేరారు. మార్గమధ్యలో లచ్చిరెడ్డి గూడెం వద్దకు చేరుకోగానే వారు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన ఇద్దరూ వెంటనే బైక్ నుంచి దిగి దూరంగా వెళ్లడంతో పెను ప్రమాదం తప్పింది. క్షణాల్లోనే మంటలు బైక్ మొత్తం వ్యాపించడంతో వాహనం పూర్తిగా కాలిపోయింది. స్థానికులు వ్యవసాయ బోరు నుంచి నీటిని తీసుకొచ్చి మంటలను అదుపు చేశారు.

అనుమతి లేని ప్లాట్లు కొనొద్దు

- పంచాయతీ అనుమతులు పరిశీలించాకే కొనుగోలు చేయాలి
- నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.5 వేల జరిమానా



ప్రజానావ, గట్టుప్పల్: అనుమతి లేని ప్లాట్లను కొనుగోలు చేయవద్దని గట్టుప్పల్ గ్రామ సర్పంచ్ నామని జగన్నాధం ప్రజలకు సూచించారు. గురువారం ఆయన అధ్యక్షతన గ్రామ పంచాయతీలో నిర్వహించిన సమావేశంలో అనధికారిక ప్లాట్ల విక్రయాలు, కొనుగోళ్లపై ప్రజలకు హెచ్చరిక జారీ చేశారు. పంచాయతీ అనుమతులు లేని ప్లాట్లలో భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడంతోపాటు తాగునీరు, డ్రైనేజీ, వీధి దీపాలు వంటి మౌలిక వసతులు కల్పించబోమని స్పష్టం చేశారు. ప్లాట్లు కొనుగోలు చేసే ముందు తప్పనిసరిగా పంచాయతీ అనుమతులు, సంబంధిత వివరాలను పరిశీలించాలని సూచించారు. అలాగే గ్రామంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలని నిర్ణయించారు. నిబంధనలు ఉల్లంఘించి ప్లాస్టిక్ వినియోగిస్తే రూ.5 వేల జరిమానా విధించాలని సమావేశంలో తీర్మానించారు. ప్లాస్టిక్ రహిత గ్రామ నిర్మాణానికి ప్రజలు సహకరించాలని సర్పంచ్ కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భరత్, ఉపసర్పంచ్ లక్ష్మయ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఎన్యూమరేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలి



ప్రజానావ, ఖమ్మం: ఖమ్మం నగరంలో కొనసాగుతున్న ఎన్యూమరేషన్, వెరిఫికేషన్ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య అధికారులను ఆదేశించారు. గురువారం ఏఈఆర్‌వోలు, సూపర్‌వైజర్లతో సమీక్ష నిర్వహించిన ఆయన.. ఇప్పటివరకు పూర్తయిన ఎన్యూమరేషన్ ప్రక్రియను ఏఈఆర్‌వోల వారీగా పరిశీలించారు. మొత్తం 75 శాతం ప్రక్రియ పూర్తయిందని, ఇంకా 25 శాతం మిగిలి ఉందని అధికారులు వివరించగా.. మిగిలిన పనులను అక్టోబర్ మొదటి వారంలోగా పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. బీఎల్‌వోలు తప్పనిసరిగా ఇంటింటికీ వెళ్లి వెరిఫికేషన్ చేపట్టేలా సూపర్‌వైజర్లు పర్యవేక్షించాలని, నోటీసులు, వెరిఫికేషన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. ఇంటి వద్ద సంబంధిత వ్యక్తులు అందుబాటులో లేని సందర్భంలో నిబంధనల మేరకు వాట్సాప్ ద్వారా సంబంధిత ఫారాలను పంపించేలా బీఎల్‌వోలకు మార్గనిర్దేశం చేయాలని చెప్పారు. కొత్త ఓటర్ల నమోదు దరఖాస్తులతో పాటు ఓటర్ల వివరాల్లో సవరణలు, తొలగింపులు, ఇతర మార్పులకు సంబంధించిన పెండింగ్ ఫారాలను పరిశీలించి నిబంధనల ప్రకారం వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఎలాంటి జాప్యం లేకుండా మొత్తం ప్రక్రియను పూర్తి చేసేందుకు ఏఈఆర్‌వోలు, సూపర్‌వైజర్లు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ సూచించారు.

చర్ల బిడ్డకు అంతర్జాతీయ మెటలర్జీ పురస్కారం

కెనడాలో ప్రతిష్ఠాత్మక అవార్డుతో పాటు బంగారు పతకం అందుకున్న శాస్త్రవేత్త శ్రీనివాసరావు

ప్రజానావ, భద్రాద్రి కొత్తగూడెం: చర్ల మండలానికి చెందిన శ్రీనివాసరావు అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మక పురస్కారం అందుకున్నారు. చర్ల మండలంలో పదో తరగతి వరకు విద్యాభ్యాసం చేసిన ఆయన హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూలో మెకానికల్ ఇంజినీరింగ్‌లో బ్యాచిలర్ ఆఫ్ టెక్నాలజీ పూర్తి చేశారు. అనంతరం ఇండస్ట్రియల్ మెటలర్జీలో మాస్టర్ ఆఫ్ టెక్నాలజీ చదివారు. రూర్కీలోని ఐఐటీలో ఉన్నత విద్యను అభ్యసించిన ఆయన కర్నూలులో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ప్రస్తుతం బెంగళూరులో భారత ప్రభుత్వ భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సెంట్రల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్ (సీఎంటీఐ)లో శాస్త్రవేత్తగా విధులు నిర్వర్తిస్తున్నారు. పరిశోధనా రంగంలో విశేష ప్రతిభ కనబరిచిన శ్రీనివాసరావుకు ఏఎస్ఎం ఇంటర్నే షనల్, ఇంటర్వేషనల్ మెటలోగ్రాఫిక్ సొసైటీ(ఐఎంఎస్) ఆధ్వర్యంలో కెనడాలోని క్యూబెక్ సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రతిష్ఠాత్మక అవార్డుతో పాటు బంగారు పతకాన్ని ప్రదానం చేశారు. గ్రామీణ ప్రాంతంలో సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి విద్యాభ్యాసం ప్రారంభించి ఉన్నత విద్యను అభ్యసిస్తూ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అథ్లెటిక్స్‌లో మహిళా కళాశాల విద్యార్థినుల సత్తా

- రాష్ట్రస్థాయి పోటీల్లో మూడు పతకాలు
- బంగారు పతకంతో మెరిసిన యోషిత



ప్రజానావ, బీబీనగర్: క్రీడల్లోనూ తమ ప్రతిభను చాటుతూ మహాత్మా జ్యోతిబాపూలే సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయిలో సత్తా చాటారు. హనుమకొండలో నిర్వహించిన 12వ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో అండర్–18, అండర్–20 బాలికల విభాగాల్లో కళాశాల విద్యార్థినులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో కళాశాలకు చెందిన తొమ్మిది మంది విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కాగా, ముగ్గురు పతకాలు సాధించడం విశేషం. ఎంఎస్‌డీఎస్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని యోషిత 3,000 మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో అద్భుత ప్రతిభ కనబరిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. బీకాం తృతీయ సంవత్సరం విద్యార్థిని జి.చైతన్య 3,000 మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో రజత పతకం సాధించగా, బీకాం ప్రథమ సంవత్సరం విద్యార్థిని నవ్య 800 మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో కాంస్య పతకాన్ని సాధించింది. రాష్ట్రస్థాయి పోటీల్లో కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచి మూడు పతకాలు సాధించడంపై కళాశాల ప్రిన్సిపాల్ వేల్పూరి రాధ, అధ్యాపక బృందం, వ్యాయామ అధ్యాపకురాలు ఎ.బేబీ, డా.పి.అనిత హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థినులను క్రీడల్లో ప్రోత్సహిస్తూ వారి ప్రతిభను వెలికితీస్తున్న అధ్యాపక బృందాన్ని అభినందించారు. రాష్ట్రస్థాయి వేదికపై సత్తా చాటి పతకాలు సాధించిన యోషిత, చైతన్య, నవ్యలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. భవిష్యత్తులోనూ విద్యార్థినులు క్రీడారంగంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఆయిల్‌పాం గెలల సేకరణలో భారీ అక్రమాలు

- గుత్తేదారు తొలగింపుతో ఒక్కొక్కటిగా వెలుగులోకి
- తప్పుడు రికార్డులతో బిల్లులు, రవాణా ఖర్చుల స్వాహా ఆరోపణలు



ప్రజానావ, ఖమ్మం: ఆయిల్‌పాం గెలల సేకరణలో గుత్తేదారు అక్రమాలపై వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో ఆయ నను తొలగించడంతో ఇంతకాలం వెలుగుచూడని అవకతవ కలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ఫిర్యాదులు అంది నా చర్యలు తీసుకోవడంలో అధికారులు ఉదాసీనంగా వ్యవ హరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయిదెకరాల భూమి ఉన్న రైతు ఏకంగా 500 టన్నుల గెలలు సరఫరా చేసినట్లు రికార్డులు సృష్టించి, వాటికి సంబంధించిన బిల్లులు, రవాణా ఖర్చులు పొందినట్లు ఆరోపణలున్నాయి. సత్తుపల్లి, దమ్మపేట మండలాల నుంచి సేకరించిన గెలలను ఎర్రుపా లెం, ముదిగొండ, వైరా ప్రాంతాల నుంచి సేకరించినట్లు రికార్డుల్లో చూపించి రవాణా బిల్లులు పొందినట్లు ఆరోపణలు రావడంతో ఆయిల్‌ఫెడ్ ఆదాయానికి భారీగా గండిపడినట్లు తెలుస్తోంది. మహబూబాబాద్, వైరా, వేంసూరు, ముదిగొం డ, సత్తుపల్లి మండలాల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో గత నెల 27న గుత్తేదారు నియామకాన్ని ఆయిల్‌ఫెడ్ ఎండీ రద్దు చేశారు. దీనిని సవాలు చేస్తూ ఈ నెల 19న గుత్తేదారు కోర్టును ఆశ్రయించగా.. నాలుగు రోజుల తర్వాత కోర్టు నిబంధనల ప్రకారం వ్యవహరించాలని సూచించింది. ఈ నేపథ్యంలో ఈ నెల 26న సదరు గుత్తేదారును తొలగిస్తూ ఆయిల్‌ఫెడ్ మరోసారి ఆదేశాలు జారీ చేసింది. గుత్తేదారుపై ఫిర్యాదులు వచ్చినప్పటికీ అధికారులు సకాలంలో స్పందించలేదనే ఆరోపణలు ఉన్నాయి. 2026 మే 10న, జూలై 14న వేంసూరు, మర్లపాడు, పరిసర గ్రామాలకు చెంది న రైతులు టీజీ ఆయిల్‌ఫెడ్ ఖమ్మం డీఓకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని రైతులు పేర్కొంటు న్నారు. రెండు నెలల క్రితం, గత నెల మహబూబాబాద్ ప్రాంత రైతులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావును, ఆయిల్‌ఫెడ్ ఎండీలను కలిసి రాతపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో వ్యవహారంలో కదలిక వచ్చినట్లు తెలుస్తోంది. మంత్రి ఆదేశాలతో గుత్తేదారు సత్యంబాబు నియామకాన్ని అధికారులు రద్దు చేశారు. 2021లో 50 ఎకరాలు కూడా లేని ఎర్రుపాలెం మండలం నుంచి సుమారు 3,200 టన్నుల గెలలు తరలించినట్లు రికార్డుల్లో చూపి వాటికి రవాణా ఛార్జీలు చెల్లించినట్లు ఆరోపణలున్నాయి. దీనివల్ల సుమారు రూ.32 కోట్ల మేర అవకతవకలు జరిగాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే వేంసూరు నుంచి సేకరించిన గెలలను ముదిగొండ, మహబూబాబాద్ ప్రాంతాల నుంచి సేకరించినట్లు చూపించి లక్షలాది రూపాయల రవాణా సొమ్మును పొందినట్లు ఆరోపణలున్నాయి. రైతులు గెలలను సమీప సేకరణ కేంద్రాలకు తీసుకొచ్చినా.. దూర ప్రాంతాల నుంచి సేకరించినట్లు రికార్డుల్లో నమోదు చేసినట్లు ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. అంతేకాకుండా రైతులు తీసుకొచ్చిన గెలల్లో 30 నుంచి 50 కిలోల వరకు తరుగు పేరుతో తగ్గించి, వాటిని పరిశ్రమలకు తరలించినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

పౌష్టికాహారంతో తల్లీబిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం

- పోషణ మాసంలో అవగాహన
- సమతుల్య ఆహారంతో ఆరోగ్యకర సమాజ నిర్మాణం

ప్రజానావ, నల్లగొండ: పోషక విలువలతో కూడిన ఆహారాన్ని క్రమం తప్పకుండా తీసుకుంటే తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి పౌష్టికాహారం ఎంతో కీలకమని నల్లగొండ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిహారిక అన్నారు. నల్లగొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మన్యం సెక్టార్ 24వ డివిజన్‌లో గురువారం పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు పోషకాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు సమతుల్య ఆహారం ఎంతో అవసరమని నిహారిక తెలిపారు. గర్భిణీలు, బాలింతలు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడంతో పాటు ఆరోగ్యం, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న వివిధ సేవలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చిన్నారులు, గర్భిణీలు, బాలింతల కు అవసరమైన పోషకాహారంపై కుటుంబ సభ్యులు కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ప్రమీల, ప్రేమలత, షాహిదా, ఆశా వర్కర్ సువర్ణ, ఆర్పీ అండాలు పాల్గొన్నారు.





ఎమ్మెల్సీ ఎన్నికలు.. సెమీఫైనల్‌గా భావించాలి

- పట్టభద్రుల ఓటు నమోదు చేయించాలి
- బీఆర్ఎస్ శ్రేణులకు నిరంజన్‌రెడ్డి దిశానిర్దేశం

ప్రజానావ, మహబూబ్‌నగర్: రాష్ట్రంలో జరగనున్న రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను సాధారణ ఎన్నికలకు సెమీఫైనల్స్‌గా భావిస్తున్నామ ని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్–రంగారెడ్డి–పాలమూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భం గా పార్టీ శ్రేణులకు ఎన్నికల్లో వ్యవహరిం చాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. ఉద్యోగులు, నిరుద్యోగు లకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయకపోవడంతో వారిలో తీవ్ర అసంతృప్తి నెలకొం దని నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టభద్రులం దరూ తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని, పార్టీ శ్రేణులు గ్రామగ్రామాన పట్టభద్రులను కలిసి ఓటు నమోదు చేయించాలని సూచించారు. హైదరా బాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ పట్టభద్రుల నియోజక వర్గం పరిధిలో ఎన్నిక జరగనుందని తెలిపారు. ప్రభుత్వంపై వివిధ వర్గాల్లో అసంతృప్తి ఉందని, ఈ నేపథ్యంలో పార్టీ శ్రేణులు ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పనిచేయాలని కోరారు. అభ్యర్థి ఎంపిక విషయంలో పార్టీ తీసుకునే నిర్ణయమే తుది నిర్ణయ మని, దాన్ని ప్రతి ఒక్కరూ గౌరవిం చాలని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి బీఆర్ఎస్ అభ్యర్థి విజయా నికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాగా, హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గాలకు సంబంధించిన ఓటర్ల జాబితాలను తాజాగా సిద్ధం చేస్తున్నారు. అర్హులైన పట్టభద్రులు కొత్తగా ఓటు నమోదు చేసుకోవాలని ఎన్నికల అధికారులు సూచించారు.

భూ భారతి సర్వర్ డౌన్.. రిజిస్ట్రేషన్లకు బ్రేక్

- స్లాట్ బుక్ చేసుకున్నా ముందుకు సాగని ప్రక్రియ
- గంటల తరబడి కార్యాలయాల వద్ద పడిగాపులు

ప్రజానావ, నల్లగొండ : భూ భారతి పోర్టల్ సర్వర్ డౌన్ కావడంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిలిచిపోయింది. ఇప్పటికే స్లాట్ బుక్ చేసుకున్న కొనుగోలుదారులు, విక్రయదారులు బుధవారం ఉదయం నుంచి రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. స్లాట్ బుక్ చేసుకున్నప్పటికీ సర్వర్ పనిచేయకపోవడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. రిజిస్ట్రేషన్ పూర్తవుతుం దన్న ఆశతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు సైతం గంటల తరబడి కార్యాలయాల వద్దే నిరీక్షించాల్సి వస్తోంది. సర్వర్ అందుబాటులో లేని సమయంలో స్లాట్లు బుక్ చేసుకోకుండా, ముందుగానే పరిస్థితిని స్పష్టం చేయాలని సంబంధిత అధికారులను కొనుగోలుదారులు, విక్రయదారులు కోరుతున్నారు. స్లాట్ బుకింగ్ చేసుకున్న తర్వాత రిజిస్ట్రేషన్ జరగకపోవడంతో విలువైన సమయంతో పాటు డబ్బు కూడా వృథా అవుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూ భారతి పోర్టల్‌లో నెలకొన్న సాంకేతిక సమస్యను వెంటనే పరిష్కరించి సర్వర్ సేవలను పునరుద్ధరించాలని, నిలిచిపోయిన రిజిస్ట్రేషన్లను త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతున్నారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో గందరగోళం

- మాట్లాడేందుకు అవకాశం ఇవ్వలేదంటూ బీఆర్ఎస్ కౌన్సిలర్ ఆగ్రహం
- పోలీస్‌స్టేషన్‌కు తరలింపు
- జాబితాపై లబ్ధిదారుల అభ్యంతరాలు

ప్రజానావ, నాగర్‌కర్నూల్: జిల్లా కేంద్రంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు గందరగోళంగా సాగింది. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించిన రెండో వార్డులో కేటాయింపుల సందర్భంగా ఆ వార్డుకు చెందిన బీఆర్ఎస్ కౌన్సిలర్ తిమ్మాజీ పేట పాండుకు మాట్లాడేందుకు అవకాశం కల్పించకపోవడంతో రసాభస చోటుచేసుకుంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో సౌకర్యాలు ఇంకా పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదని, అలాంటప్పుడు ఇళ్లను ఎలా కేటాయిస్తారని పాండు ప్రశ్నించారు. దీంతో పోలీసులు ఆయనను పోలీస్‌స్టేషన్‌కు తరలించడం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు ముందుగా విడుదల చేసిన జాబితా ప్రకారం కాకుండా ఇష్టానుసారంగా లబ్ధిదారుల ఎంపిక జరిగిందని పలువురు ఆరోపించారు. కాంగ్రెస్ కౌన్సిలర్లు ఉన్న వార్డులకు ఎక్కువ సంఖ్యలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించేలా చేశారని లబ్ధిదారులు ఆరోపణలు చేశారు. నెల రోజుల కిందట ప్రకటించిన జాబితాలో పేర్లు ఉన్నప్పటికీ లబ్ధిదారుల ఎంపిక కోసం డ్రా తీసే సమయంలో తమ పేర్లు కనిపించలేదని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. ఏళ్లుగా నాగర్‌కర్నూల్‌లో నివాసం ఉంటున్న స్థానికులను పక్కనపెట్టి బీహార్ ప్రాంతానికి చెందిన వారికి ఇళ్లు కేటాయించడం ఏమిటని వారు ప్రశ్నించారు. కేటాయింపు ప్రక్రియపై అధికారులు స్పష్టత ఇవ్వాలని, అర్హులైన స్థానిక లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు. ఈ వ్యవహారంపై అధికారుల నుంచి పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది.



తల్లి మృతి.. ఇద్దరు పిల్లలు అనాథలు

- భర్తను కోల్పోయిన కొన్నాళ్లకే తల్లినీ కోల్పోయిన చిన్నారులు
- పాఠశాల బస్సు ఢీకొని ల్యాబ్ టెక్నీషియన్ మృతి



ప్రజానావ, కోదాడ: ఆమె ఆకస్మిక మరణం ఇద్దరు బిడ్డల ను అనాథలను చేసింది. ఇప్పటికే భర్తను కోల్పోయిన ఆమె.. ఆ దుఃఖాన్ని దిగమింగి పిల్లలే లోకంగా జీవిస్తూ, వారి చదువులు, భవిష్యత్తు కోసం ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. ఈ క్రమంలో విధి మరోసారి ఆ కుటుంబంపై పగబట్టినట్లు ఆమెను కూడా పొట్టనబెట్టుకుంది. పిల్లల భవిష్యత్తు కోసం విధులకు వెళ్లిన తల్లికి పాఠశాల బస్సు మృత్యువు రూపంలో ఎదురొచ్చింది. అమ్మానాన్నలను కోల్పోయిన ఆ చిన్నారులు దిక్కులేనివారయ్యారు. ఈ హృదయ విదారక ఘటన కోదాడ పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. అనంతగిరికి చెందిన ఉపేంద్రమ్మ (45) కోదాడ పట్టణంలోని నయానగర్‌లో నివాసం ఉంటూ అనురాగ్ ఇంజినీరింగ్ కళాశాలలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నారు. విధులు ముగించుకున్న అనంతరం సహోద్యోగి శిరీషతో కలిసి ద్విచక్ర వాహనంపై కోదాడకు వస్తుండగా బోడిగుట్ట సమీపంలో ప్రమాదం జరిగింది. పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన బస్సు ఎదురుగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఉపేంద్రమ్మ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందారు. ఆమెతో పాటు ప్రయాణిస్తున్న శిరీషకు గాయా లయ్యాయి. ప్రమాద విషయం తెలిసిన వెంటనే స్థానికులు అక్కడికి చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించే ప్రయ త్నం చేశారు. అయితే అప్పటికే ఉపేంద్రమ్మ మృతి చెందినట్లు తెలిపారు. భర్తను గతంలోనే కోల్పోయిన ఉపేంద్రమ్మ.. ఇద్దరు పిల్లల బాధ్యతలను ఒంటరిగా మోస్తూ వారి చదువులు, భవిష్యత్తు కోసం శ్రమిస్తున్నారు. ఈ క్రమంలో ఆమె కూడా రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో కుమారుడు, కుమార్తె తల్లిదండ్రులిద్దరినీ కోల్పోయి అనాథలయ్యారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న ఉపేంద్రమ్మ మృతితో బంధువులు, స్థానికులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఘటనపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



సింగరేణి బొగ్గు రవాణాలో 4 శాతం వృద్ధి

ప్రజానావ, హైదరాబాద్: సెప్టెంబర్ 30తో ముగిసిన తొలి ఆర్థిక అర్ధ సంవత్సరంలో సింగరేణి బొగ్గు రవాణా, ఓవర్‌బర్డెన్ తొలగింపులో వృద్ధి సాధించింది. గత ఏడాది ఇదే కాలంలో 287.6 లక్షల టన్నుల బొగ్గును రవాణా చేయగా, ఈ ఏడాది 299.4 లక్షల టన్నులు రవాణా చేసి 4 శాతం వృద్ధి నమోదు చేసింది. ఓవర్‌బర్డెన్ తొలగింపులోనూ 11 శాతం వృద్ధి సాధించింది. రాష్ట్ర థర్మల్ విద్యుత్ కేంద్రాలకు గత ఏడాది 159.1 లక్షల టన్నుల బొగ్గు సరఫరా చేయగా, ఈ ఏడాది 198.2 లక్షల టన్నులు సరఫరా చేసింది. ఇది 24.58 శాతం అధికం. కొత్తగూడెం, యాదాద్రి, భద్రాద్రి, సింగరేణి థర్మల్ కేంద్రాలకు గత ఏడాదితో పోలిస్తే అధికంగా బొగ్గు సరఫరా చేసినట్లు సంస్థ తెలిపింది. రాష్ట్ర విద్యుత్ అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ బొగ్గు ఉత్పత్తి, రవాణా పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి తెలిపారు. ఏడాదికి 620 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, 650 లక్షల టన్నుల రవాణా లక్ష్యాలను సాధించే దిశగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు.

సిరిసిల్ల సభలో అభివృద్ధి మాట లేదు..

కేసీఆర్, కేటీఆర్‌పై వ్యక్తిగత విమర్శలే

- బీఆర్ఎస్ నేతల ధ్వజం
- కేసీఆర్ హయాంలో తెచ్చిన ప్రాజెక్టులకే రిబ్బన్లు కట్ చేయడం తప్ప.. మూడేళ్లలో కాంగ్రెస్ చేసిందేమిటో చెప్పాలి
- సిరిసిల్ల అభివృద్ధిని ఆదర్శంగా తీసుకుని కొడంగల్‌ను అభివృద్ధి చేయాలి
- రాజన్న సిరిసిల్ల జిల్లా తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ముఖ్య నాయకులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేల మీడియా సమావేశం



ప్రజానావ, సిరిసిల్ల : సిరిసిల్లలో చేనేత రంగానికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, వర్కర్ టు ఓనర్ పథకాన్ని పునరుద్ధరించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ముఖ్య నాయకుల మీడియా సమావేశం నిర్వహించారు. సిరిసిల్లలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన సభలో కేసీఆర్, కేటీఆర్‌పై చేసిన వ్యక్తిగత విమర్శలు, ఆరోపణలను బీఆర్ఎస్ నేతలు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ పలు డిమాండ్ లు చేశారు కరీంనగర్‌లో పెండింగ్‌లో ఉన్న రైల్వే బ్రిడ్జి పనులను వేగవంతం చేయాలని, కరీంనగర్‌కు కొత్త అభివృద్ధి ప్రాజెక్టులు ప్రకటించాలని, హుజురాబాద్‌కు రెండో విడత దళితబంధు నిధులు విడుదల చేయాలని, హుజురాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.1,000 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో చేనేత రంగం పరిస్థితిపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని, గత ప్రభుత్వంపై చేస్తున్న ఆరోపణలకు ఆధారాలు బయటపెట్టి ప్రజలకు వాస్తవాలు వివరించాలన్నారు. బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతూ..నిన్నటి సిరిసిల్ల సభలో రాష్ట్ర ప్రజలు ఎదురుచూసిన రైతులు, చేనేత కార్మికులు, సాగునీరు, ఉపాధి, అభివృద్ధి అంశాలపై సమాధానాలు ఇవ్వకుండా కేసీఆర్, కేటీఆర్‌పై వ్యక్తిగత విమర్శలకే ముఖ్యమంత్రి ప్రాధాన్యత ఇచ్చారని విమర్శించారు. ఈ మీడియా సమావేశంలో మాజీ మంత్రులు గంగుల కమలాకర్, జీవన్ రెడ్డి, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, డాక్టర్ సంజయ్, మాజీ ఎమ్మెల్యేలు దాసరి మనోహర్ రెడ్డి, రసమయి బాలకిషన్, సుంకే రవిశంకర్, పుట్టా మధు,మాజీ ఎమ్మెల్సీ నరదాసు లక్ష్మణ్ రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, న్యాలకొండ అరుణ రాఘవ రెడ్డి, దావ్వ వసంత, మాజీ సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ తో పాటు బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో వృద్ధుల పాత్ర కీలకం



ప్రజానావ, మంచిర్యాల: సమాజ నిర్మాణంలో వయోవృద్ధుల పాత్ర కీలకమని జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో జిల్లా మహిళా శిశు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. అదనపు కలెక్టర్ పలువురు అధికారులు, వృద్ధులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో వయోవృద్ధులో చాలామంది నిరాదరణకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధుల పట్ల సమాజ దృక్పథంలో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం వృద్ధుల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పి స్తూ ప్రతిజ్ఞ చేయించారు. పలువురు వయోవృద్ధులను ఘనంగా సన్మా నించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, వయోవృద్ధులు పాల్గొన్నారు.

రాత్రివేళ అటవీ భూమిలో అక్రమంగా మట్టి తరలింపు

- పట్టించుకోని అధికారులు? అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు
- విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం: ఇన్‌చార్జి రేంజ్ అధికారి శీతల్



ప్రజానావ, కోనరావుపేట: అటవీ భూములను సంరక్షించాల్సిన బాధ్యత కలిగిన అధికారుల పర్యవేక్షణలోపం కారణంగా విలువైన అటవీ భూమి అక్రమార్కుల చేతుల్లోకి వెళ్తుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలోని నిమ్మపల్లి–కోనరావుపేట ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న అటవీ ప్రాంతంలో రాత్రివేళల్లో అక్రమంగా మట్టి తరలిస్తూ అటవీ భూమిని చదును చేస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా కలకలం రేపుతున్నాయి. కోనరావుపేట సెక్షన్ పరిధిలోని నిమ్మపల్లి బీట్‌లో, నిమ్మపల్లి పల్లె ప్రకృతి వనాన్ని ఆనుకుని ఉన్న అటవీ భూమిలో మట్టి తవ్వి తరలించిన ఆనవాళ్లు స్పష్టంగా కనిపిస్తున్నాయని గ్రామస్తులు, ప్రకృతి ప్రేమికులు చెబుతున్నారు. ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ప్రాంతంలోనే ఈ కార్యకలాపాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత అటవీ శాఖ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని వారు ప్రశ్నిస్తున్నారు.

అధికారులకు తెలిసే జరుగుతుందా?

రాత్రివేళల్లో భారీగా మట్టి తరలించేందుకు వాహనాలు సంచరిస్తున్నప్పటికీ అధికారుల దృష్టికి రాకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని స్థానికులు అంటున్నారు. అటవీ భూమిలో మట్టిని తొలగించి భూమిని చదును చేయడం వెనుక ఎవరి ప్రమేయం ఉందో అధికారులు సమగ్రంగా విచారణ చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అటవీ భూములను రక్షించాల్సిన సిబ్బంది నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. కొందరు అధికారులు, సిబ్బంది దీర్ఘకాలంగా ఇదే ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్నప్పటికీ అక్రమ మట్టి తరలింపును అడ్డుకోవడంలో విఫలమవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

పాత ఆరోపణలపై మళ్లీ చర్చ

ఇదిలా ఉండగా, గతంలో ఇదే కోనరావుపేట సెక్షన్‌లో పనిచేసిన ఓ అధికారి తిరిగి ఇదే ప్రాంతానికి రావడంతో పాత ఆరోపణలు మరోసారి తెరపైకి వచ్చాయి. గతంలో ఆయన పనిచేసిన సమయంలో అక్రమార్కులకు సహకరించారంటూ అప్పట్లో ఆరోపణలు వచ్చినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది. అదేవిధంగా నిమ్మపల్లి బీట్ పరిధిలో కొందరు అధికారులు, సిబ్బంది ఏళ్ల తరబడి పనిచేస్తుండటంతో పర్యవేక్షణలో లోపాలు ఏర్పడుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అటవీ భూముల పరిరక్షణలో నిర్లక్ష్యానికి తావులేకుండా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.

విచారణ చేసి చర్యలు తీసుకుంటాం: శీతల్

ఈ విషయాన్ని ఇన్‌చార్జి రేంజ్ అధికారిణి శీతల్ దృష్టికి తీసుకెళ్లగా, తమ సిబ్బందిని పంపించి సంఘటనా స్థలాన్ని పరిశీలించి పూర్తి వివరాలు తెలుసుకుంటామని తెలిపారు. అటవీ భూమిలో ఏం జరిగిందో సమగ్రంగా విచారణ చేసి, అక్రమాలు జరిగినట్లు తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు. అటవీ భూముల్లో చెట్లను నరికి అక్రమంగా భూములను చదును చేస్తే కఠిన చర్యలు తప్పవని శీతల్ హెచ్చరించారు. అడవుల నరికివేత వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని, వాతావరణ మార్పులు, ఎల్‌నినో వంటి ప్రభావాలు కూడా పర్యావరణం పై ప్రభావం చూపుతు న్నాయని ఆమె పేర్కొన్నారు. అటవీ సంరక్షణ కేవలం అధికారుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు బాధ్యతగా తీసుకుని చెట్లను కాపాడాలని సూచించారు. అటవీ భూమిలో అక్రమ మట్టి తరలింపు జరిగితే దాని వెనుక ఎవరున్నారు? అధికారుల పర్యవేక్షణలోపం ఉందా? అనే అంశాలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తేవాలని నిమ్మపల్లి గ్రామస్తులు, మండల ప్రజలు కోరుతున్నారు.

పటిష్టమైన భద్రతా ఏర్పాట్లతో..

గణేష్ నిమజ్జనం, సీఎం పర్యటన విజయవంతం

జిల్లా ఎస్పీకి అభినందనలు తెలిపిన పోలీస్ అధికారుల సంఘం సభ్యులు



ప్రజానావ, సిరిసిల్ల : జిల్లాలో రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన, గణేష్ నిమజ్జనం సందర్భంగా జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆధ్వర్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ముందస్తు ప్రణాళికతో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ముందస్తు ప్రణాళికతో సమర్థవంతమైన బందోబస్తు నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలతో పాటు పోలీసు అధికారులు, సిబ్బంది మధ్య సమన్వయం ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా గణేష్ నిమజ్జనం, ముఖ్యమంత్రి జిల్లా పర్యటనను విజయవంతంగా నిర్వహించినందుకు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ను జిల్లా పోలీస్ అధికారుల సంఘం సభ్యులు గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు, సమర్థవంతమైన విధుల నిర్వహణలో ఎస్పీ చూపిన నాయకత్వాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు గోపాల్, ఉపాధ్యక్షులు ఎస్ఐ వెంకట్రాజం, సెక్రటరీ నాగేశ్వరరావు, శ్రీనాథ్ రాజ్, .ప్రకాష్, వేణు, తిరుపతి, మహేష్ పాల్గొన్నారు.

ఎగువ మానేరు 9వ ప్యాకేజీ పనులు పూర్తి చేయాలి

- లక్ష ఎకరాలకు శాశ్వత సాగునీరు అందించాలి
- మాజీ ఎమ్మెల్యే మృత్యుంజయం ఆధ్వర్యంలో మీడియా సమావేశం, సీఎంకు ఎగువ మానేరు ప్రాజెక్టు పరిరక్షణ సమితి వినతి



ప్రజానావ, సిరిసిల్ల : ఎగువ మానేరు 9వ ప్యాకేజీ పనులను వెంటనే చేపట్టి పూర్తి చేసి సుమారు లక్ష ఎకరాలకు శాశ్వత సాగునీరు అందించాలని ఎగువ మానేరు ప్రాజెక్టు పరిరక్షణ సమితి కోరింది. ఈ మేరకు సమితి ప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించగా గురువారం సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దివంగత ముఖ్యమంత్రి డా. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఈ ప్రాంతానికి సాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారని సమితి పేర్కొంది. అనంతరం ప్రాజెక్టు రూపకల్పనలో మార్పులు చోటు చేసుకుని కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో వివిధ ప్యాకేజీలుగా పనులు కొనసాగాయని తెలిపింది. అయితే ఎగువ మానేరు ప్రాంతానికి అత్యంత కీలక మైన 9వ ప్యాకేజీ పనులు పూర్తిస్థాయిలో ముందుకు సాగకపోవడంతో సిరిసిల్ల ప్రాంత రైతులు సాగునీటి కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. 9వ ప్యాకేజీ పూర్తయితే సుమారు లక్ష ఎకరాల సాగుభూమికి శాశ్వతంగా నీటి ప్రయోజనం కలిగే అవకాశం ఉందని వివరించింది. సీఎం రేవంత్‌రెడ్డి సిరిసిల్ల ప్రాంత పర్యటన సందర్భంగా ఎగువ మానేరు ప్రాజెక్టును స్వయంగా పరిశీలించి, 9వ ప్యాకేజీ పనులకు అవసరమైన నిధులు మంజూరు చేసి నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేయించాలని విజ్ఞప్తి చేశామన్నారు. తన చేతుల మీదుగా పనులను ప్రారంభిస్తే రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని పేర్కొంది. అలాగే ఎగువ మానేరు కుడి, ఎడమ కాలువల పరిస్థితిని పరిశీలించి దెబ్బతిన్న లైనింగ్ పనులను పునరుద్ధరించాలని కోరింది. నీటి వృథాను అరికట్టి అందుబాటులో ఉన్న నీటిని రైతుల పొలాలకు సమర్థవంతంగా అందిం చేలా కాలువ వ్యవస్థను ఆధునీకరించాలని సూచిం చింది. పర్యాటకంగా అభివృద్ధి చేయాలని, ఎగువ మానేరు కేవలం సాగునీటి ప్రాజెక్టు మాత్రమే కాకుండా ప్రకృతి అందాలతో కూడిన ప్రాంతమని సమితి పేర్కొంది. రిజర్వాయర్ పరిసరాలను సుందరీకరించి పర్యాటక సదుపాయాలను అభివృద్ధి చేయాలని కోరింది. వ్యూ పాయింట్లు, వాకింగ్ ప్రాంతాలు, అవసరమైన చోట్ల బోటింగ్ తదితర సౌకర్యాలను పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసింది. దీంతో వ్యవసాయాభివృద్ధితో పాటు పర్యాటక రంగం అభివృద్ధి చెంది స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపింది. ఈ ప్రాంత రైతుల సాగునీటి సమస్యలను దృష్టిలో ఉంచుకుని 9వ ప్యాకేజీ పనులకు నిధులు మంజూరు చేసి వేగవంతం చేయడానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని ఎగువ మానేరు ప్రాజెక్టు పరిరక్షణ సమితి ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం ముఖ్యమంత్రిని కోరారు.

మైనర్లను మత్తులోకి దింపుతున్న గంజాయి దందా

- మొదట సిగరెట్లు.. ఆపై గంజాయి సిగరెట్లు
- డబ్బు కోసం బాలలకూ మత్తు పదార్థాల విక్రయం



ప్రజానావ, నిజామాబాద్: మొదట సిగరెట్లు విక్రయిస్తారు.. ఆ తర్వాత గంజాయి సిగరెట్లను అంటగడుతున్నారు. డబ్బు కోసం కొందరు పాన్, డబ్బా కొట్ల నిర్వాహకులు అడ్డదారులు తొక్కుతుండటంతో 18 ఏళ్ల నిండని బాలలు మత్తు బారిన పడుతున్నారు. నిజామాబాద్ నగరంలోని వినాయక్‌నగర్‌లో ఓ టీ స్టాల్ వద్ద సీనియర్ సిటిజన్లు టీ తాగుతుండగా అక్కడికి వచ్చిన 18 ఏళ్లలోపు బాలురు బహిరంగంగా సిగరెట్లు తాగారు. ఓ విశ్రాంత ఉద్యోగి ఇదేం పద్ధతంటూ గట్టిగా మందలించడంతో వారంతా అక్కడి నుంచి మెల్లగా జారుకున్నారు. నగరంలోని దుబ్బ, అర్సపల్లి బైపాస్, బోర్గాం (పీ), మాధవనగర్, వర్నిరోడ్‌తో పాటు పలు వాణిజ్య ప్రాంతాల్లోని దుకాణాల్లో నిషేధిత సిగరెట్లతో పాటు గంజాయిని యథేచ్ఛగా విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కానుల కక్కుర్తితో గంజాయి నింపిన సిగరెట్లను బాలలకు సైతం విక్రయిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ఒకటో ఠాణా పరిధిలోని ఓ పాన్‌షాప్‌పై కొద్దిరోజుల క్రితం పోలీసులు దాడి చేయగా గంజాయి విక్రయిస్తున్న ఓ బాలుడు పట్టుబడ్డాడు. సదరు దుకాణం వద్ద ఎప్పుడూ రద్దీగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. చెడు స్నేహాలతో పక్కదారి చెడు స్నేహాలకు అలవాటుపడుతున్న కొందరు మైనర్లు టీ స్టాళ్లు, కిరాణా దుకాణాలు, పాన్ డబ్బాల వద్దకు వెళ్లి సిగరెట్లు తాగడం ప్రారంభిస్తున్నారు. ఆ తర్వాత అక్కడే లభించే గంజాయి సిగరెట్లకు అలవాటై మత్తులో జోగుతున్నారు. క్రమంగా జల్సాలకు అలవాటుపడి చోరీలకు సైతం తెగబడుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లోనూ గంజాయి అందుబాటులోకి వస్తున్నట్లు సమాచారం. మైనర్లను మత్తు రొంపిలోకి దింపుతున్న ముఠాలు, వారికి గంజాయి విక్రయిస్తున్న దుకాణదారులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అధికార యంత్రాంగం తగిన స్థాయిలో స్పందించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

కఠిన చర్యలతోనే కట్టడి

హైదరాబాద్ ఓల్డ్ బోయిన్‌పల్లిలో విద్యార్థులకు సిగరెట్లు విక్రయించిన వారిపై జస్టిస్ జువెనైల్ (కేర్ అండ్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్) యాక్ట్–2015లోని సెక్షన్ 77, సిగరెట్స్ అండ్ అదర్ టొబాకో ప్రొడక్ట్స్ యాక్ట్ (కోప్టా)–2003లోని సెక్షన్ 6 కింద చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. నిజామాబాద్ జిల్లాలోనూ ఇలాంటి కఠిన చర్యలు చేపడితేనే మైనర్లకు నిషేధిత ఉత్పత్తుల విక్రయానికి అడ్డుకట్ట పడుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కోప్టా చట్టంలోని సెక్షన్ 4 ప్రకారం బహిరంగ ప్రదేశాలు, హోటళ్లు, సినిమా థియేటర్లు, బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లలో ధూమపానం నేరం. సెక్షన్ 6 ప్రకారం 18 ఏళ్లలోపు వారికి సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులు విక్రయించకుండా తనిఖీలు నిర్వహించాల్సి ఉంటుంది. అలాగే విద్యా సంస్థలకు వంద మీటర్ల పరిధిలో నిషేధిత పొగాకు ఉత్పత్తుల విక్రయాలు జరగకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

మూడు నెలలకే తేలుతున్న రోడ్ల నాణ్యత

- అభివృద్ధి పనుల్లో నాణ్యతపై విమర్శలు
- క్షేత్రస్థాయి పరిశీలన లేకుండానే ధ్రువపత్రాలా?

ప్రజానావ, వరంగల్: వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల నాణ్యతపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిర్మించిన మూడు, నాలుగు నెలలకే సీసీ రహదారులు దెబ్బతిని కంకర తేలుతుండటం, మురుగు కాలువలు బీటలు వారుతుండటంతో పనుల నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గుత్తేదారులు నిబంధనలను పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఇంజినీర్ల పనుల నాణ్యతను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించకుండా సంతకాలకే పరిమితమవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పరిశీలించాల్సిన క్వాలిటీ కంట్రోల్ కమిటీ (క్యూసీ) బృందం సైతం కార్యాలయాలకే పరిమితమవుతోందని, క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించకుండానే నాణ్యతా ప్రమాణాల ధ్రువపత్రాలు జారీ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. క్యూసీ ధ్రువపత్రాల జారీ పేరుతో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్, ప్రైవేటు క్యూసీ బృందాలు పర్సంటేజీలు వసూలు చేస్తున్నాయనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు సమగ్రంగా పరిశీలించి అభివృద్ధి పనుల నాణ్యతపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఆరోగ్యకరమైన అలవాట్లను అలవర్చుకోవాలి

- మైండ్ కేర్ అండ్ కౌన్సెలింగ్ సెంటర్ సైకాలజిస్ట్ పున్నంచందర్
- కార్మికులకు మనోవికాస సదస్సు



ప్రజానావ, సిరిసిల్ల : కార్మికులు ఆరోగ్యకరమైన అలవాట్లను అలవర్చుకొని, చెడు అలవాట్లకు దూరం గా ఉండాలని ప్రముఖ సైకాలజిస్ట్ కె. పున్నంచందర్ సూచించారు. గురువారం మైండ్ కేర్ అండ్ కౌన్సెలిం గ్ సెంటర్ ఆధ్వర్యంలో జయప్రకాశ్ నగర్‌లోని కార్మికులకు మనోవికాస సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సైకాలజిస్ట్ పున్నంచందర్ మాట్లాడుతూ కార్మికులు తమ శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్మికుల్లో కొంతమంది తంబాకు, బీడీ, మద్యపానం, అధిక టీ వంటి అలవాట్లకు గురవుతున్నారని, పని ఒత్తిడి, ఆందోళన, వ్యక్తిగత మరియు కుటుంబ సమస్యలను ఎదుర్కొనే క్రమంలో కొందరు ఇలాంటి అలవాట్లను ఆశ్రయిస్తున్నారని తెలిపారు. ఇవి తాత్కాలిక ఉపశమనాన్ని కలిగించిన ప్పటికీ, దీర్ఘకాలంలో ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. అలాగే మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ తగ్గడం వంటి కారణాలతో మధుమేహం, అధిక రక్తపోటు, గుండె సంబంధిత సమస్యలు, కొన్ని రకాల క్యాన్సర్ వంటి జీవనశైలి సంబంధిత వ్యాధుల ప్రమాదం పెరుగుతుం దని తెలి పారు. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయిం చుకోవడంతో పాటు, సమతుల్య ఆహారం, తగిన శారీరక వ్యాయామం, తగినంత నిద్ర, పొగాకు మరియు మద్యపానానికి దూరంగా ఉండటం వంటి ఆరోగ్యకర మైన అలవాట్లను పాటించాలని సూచించా రు. మైండ్ కేర్ అండ్ కౌన్సెలింగ్ సెంటర్ ఆధ్వర్యంలో మానసిక ఒత్తిడి, నిద్రలేమి, కుటుంబ కలహాలు, దురలవాట్లు, ఆందోళన తదితర సమస్యలకు ప్ర తిరోజూ కౌన్సెలింగ్ సేవలు అందిస్తున్నామని పున్నం చందర్ తెలిపారు. అవసరమైన వారు ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైండ్ కేర్ అండ్ కౌన్సెలింగ్ సెంటర్ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

హెలికాప్టర్ కూలి ఏడుగురు మృతి

- మృతుల్లో ప్రముఖ వ్యాపారవేత్త, ఇద్దరు పైలట్లు
- మృతుల సంఖ్యపై భిన్న కథనాలు
- ప్రమాదంలో ఎవరూ ప్రాణాలతో బయటపడలేదని మంగ్వానా వెల్లడి

మారోండెరా: జింబాబ్వేలో ఘోర హెలికాప్టర్ ప్రమాదం చోటుచేసుకుంది. ఈశాన్య మారోండెరా గ్రామీణ ప్రాంతంలో బుధవారం హెలికాప్టర్ కూలిపోవడంతో అందులో ప్రయాణిస్తున్న ఏడుగురు మృతి చెందారు. మృతుల్లో ప్రముఖ వ్యాపారవేత్తతో పాటు నలుగురు ప్రయాణికులు, ఇద్దరు పైలట్లు ఉన్నారని ప్రభుత్వ ప్రతినిధి నిక్ మంగ్వానా తెలిపారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే అత్యవసర సేవల సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో ఎవరూ ప్రాణాలతో బయటపడలేదని మంగ్వానా వెల్లడించారు. అయితే హెలికాప్టర్‌లో ప్రయాణిస్తున్న వారి సంఖ్యపై పోలీసులు, ప్రభుత్వ ప్రతినిధి వెల్లడించిన వివరాల్లో వ్యత్యాసం ఉండటం గమనార్హం. దీంతో మృతుల సంఖ్య మరింత ఎక్కువగా ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

మృత్యువు ఎదురుగా ఉన్నా.. ప్రయాణికులే ముఖ్యం

- ఉగ్రవాదుల నుంచి వందలాది మందిని కాపాడిన నీర్జా భనోట్
- ముగ్గురు చిన్నారులకు కవచంగా మారి ప్రాణత్యాగం

ముంబై: కళ్లముందే మృత్యువు కనిపిస్తున్నా.. వెనక్కి తగ్గకుండా పోరాడారు భారతీయ విమాన సిబ్బంది నీర్జా భనోట్. తన ప్రాణాల కంటే ప్రయాణికుల ప్రాణాలే ముఖ్యమని భావించి ఉగ్రవాదులను ఎదిరించి వందలాది మందిని కాపాడారు. ఇటీవల హైదుబాయ్ విమానంలో ప్రయాణికుల ప్రాణాలను కాపాడేందుకు భారత కెప్టెన్ స్మిత్ మచ్చర్ ప్రాణాలకు తెగించి పోరాడిన ఘటనను గుర్తుచేసేలా సరిగ్గా నాలుగు దశాబ్దాల క్రితం నీర్జా కూడా విమానంలోనే ప్రాణాపాయ పరిస్థితిని ఎదుర్కొన్నారు. చండీగఢ్‌కు చెందిన నీర్జా అమెరికాకు చెందిన పాన్ ఆమ్ ఎయిర్‌లైన్స్‌లో ఫ్లైట్ అటెండెంట్‌గా పనిచేశారు. ముంబై నుంచి న్యూయార్క్ వెళ్తున్న ఆ సంస్థ విమానం పాకిస్థాన్‌లోని కరాచీ విమానాశ్రయంలో ఆగిన సమయంలో ఎయిర్‌పోర్టు సిబ్బంది దుస్తుల్లో ఉన్న నలుగురు ఉగ్రవాదులు తుపాకులతో విమానంలోకి చొరబడి హైజాక్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఒక్కసారిగా కాల్పులు చోటుచేసుకోవడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. అయితే నీర్జా ఏమాత్రం కంగారుపడకుండా సమయస్ఫూర్తితో వ్యవహరించి వెంటనే కాక్‌పిట్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. దీంతో ఉగ్రవాదులు విమానాన్ని తమ ఆధీనంలోకి తీసుకోకుండా పైలట్లు అడ్డుకోగలిగారు. అనంతరం అమెరికా ప్రయాణికుల ను బందీలుగా చేసుకుని తమ డిమాండ్లను నెరవేర్చుకోవాలని ఉగ్రవాదులు ప్రయత్నించారు. అందులో భాగంగా ప్రయాణికుల పాస్‌పోర్టులు తీసుకురావాలని నీర్జాతో పాటు ఇతర సిబ్బందిని బెదిరించారు. అయితే నీర్జా వారికి సహకరించకుండా అమెరికా ప్రయాణికుల పాస్‌పోర్టులను దాచిపెట్టారు. దాదాపు 17 గంటల పాటు హైజాక్ కొనసాగింది. ప్రయాణికులను విడిపిం చేందుకు అధికారులు జరిపిన సంప్రదింపులు కొలిక్కి రాకపోవడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఈ క్రమంలో విమానంలోని ఇంధనం అయిపోవడం తో విద్యుత్ సరఫరా నిలిచిపోయి లైట్లు ఆరిపోయా యి. ఇదే అదనుగా భావించిన నీర్జా ప్రయాణికులను రక్షించే దుకు సాహసోపేత నిర్ణయం తీసుకున్నారు. నెమ్మది గా మూడు ఎగ్జిట్ డోర్లను తెరిచి ఒక్కొక్క ప్రయాణి కుడిని బయటకు పంపించడం ప్రారంభిం చారు. ఈ విషయాన్ని గుర్తించిన ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. కొంతమంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయినా నీర్జా వెనక్కి తగ్గలేదు. ముగ్గురు చిన్నారులను తూటాల నుంచి కాపాడేందుకు వారికి కవచంగా నిలిచారు. ఆ పిల్లలను సురక్షితంగా బయటకు పంపించే క్రమంలో ఉగ్రవాదుల కాల్పులకు గురై ఆమె ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన సమ యంలో విమానంలో దాదాపు 400 మంది ప్రయా ణికులు ఉండగా, కాల్పుల్లో కనీసం 20 మంది మర ణించగా మరో 100 మంది గాయపడ్డారు. అనంతరం ఉగ్రవాదులు అక్కడి నుంచి తప్పించుకోగా.. వారు పోలీసులకు చిక్కలేదు. చండీగఢ్‌లోని మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన నీర్జా.. జర్నలిస్ట హరీశ్ భనోట్ కుమార్తె. తొలుత మోడలింగ్‌పై ఆసక్తి చూపిన ఆమె ఆ తర్వాత విమానయాన రంగంలోకి అడుగు పెట్టారు. కేవలం 22 ఏళ్ల వయసులోనే ప్రయాణికుల ప్రాణాలను కాపాడే క్రమంలో వీరమరణం పొందా రు. తన పుట్టినరోజుకు కేవలం రెండు రోజుల ముందే ఆమె ప్రాణాలు కోల్పోవడం ఈ విషాదాన్ని మరింత విషాదకరంగా మార్చింది. నీర్జా ధైర్యసాహసాలను గుర్తించిన భారత ప్రభుత్వం ఆమెకు మరణానంతరం అత్యున్నత శౌర్య పురస్కారాల్లో ఒకటైన అశోక చక్రను ప్రదానం చేసింది. ఈ పురస్కారాన్ని అందుకున్న అత్యంత పిన్న వయస్కురాలైన మహిళగా నీర్జా గుర్తింపు పొందారు. ఆమె జీవితం, త్యాగం ఆధారంగా బాలీవుడ్‌లో 2016లో 'నీర్జా' పేరుతో సినిమా తెరకెక్కగా.. ప్రముఖ నటి సోనమ్ కపూర్ ఆమె పాత్రను పోషించారు.



తొమ్మిదో తరగతి పాఠ్యపుస్తకంలో రామరాజ్యం

న్యూఢిల్లీ: మహాత్మాగాంధీ ప్రతిపాదించిన 'రామరాజ్యం'ను నిజాయితీ, పారదర్శకత, కరుణ, సంక్షేమం, ప్రజాకేంద్రీకృత పాలన వంటి సూత్రాలపై ఆధారపడిన ఆదర్శ పాలనా విధానంగా ఎన్‌సీఈఆర్‌టీ రూపొందించిన తొమ్మిదో తరగతి సాంఘికశాస్త్రం పాఠ్యపుస్తకం పేర్కొంది. 'అండర్‌స్టాండింగ్ సొసైటీ: ఇండియా అండ్ బియాండ్–పార్ట్ 2' పేరుతో రూపొందించిన పుస్తకాన్ని ఎన్‌సీఈఆర్‌టీ విడుదల చేసింది. 'పాలన.. ప్రజావిధానం' అధ్యాయంలో భారతీయ పాలనా సంప్రదాయాలు, ఆధునిక ప్రజాస్వామ్య విలువలను వివరిస్తూ రామరాజ్యం భావనను ప్రస్తావించింది. ప్రజల సుఖసంతోషాలు, ప్రయోజనాలే పాలకుడి ప్రాథమ్యాలుగా ఉండాలనే భావనను ప్రతిబింబించే సంస్కృత శ్లోకాన్ని కూడా ఇందులో పొందుపరిచింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన జాతీయ విద్యావిధానం, ఆయుష్మాన్ భారత్, ఖేలో భారత్ వంటి కార్యక్రమాలను విధాన రూపకల్పనకు ఉదాహరణలుగా పాఠ్యపుస్తకంలో ప్రస్తావించారు. సత్యమేవ జయతే, 'యతో ధర్మస్తతో జయః' వంటి సూక్తులకు సంబంధించిన మూలాలను ఉపనిషత్తులు, మహాభారతంతో అనుసంధానిస్తూ వివరించారు. కొత్త పార్లమెంటు భవనంలో 2023లో ప్రతిష్ఠించిన 'సెంగోల్'కూ పాఠ్యపుస్తకంలో చోటు కల్పించారు. పాలన, సుపరిపాలనకు సంబంధించిన సాంస్కృతిక చిహ్నంగా దాన్ని అభివర్ణిస్తూ.. దాని సంప్రదాయాన్ని చోళుల కాలంతో అనుసంధానించారు.

అణు పరీక్షల గుట్టు రట్టు చేసేందుకు
అమెరికా కొత్త ప్రయోగం

- నెవాడాలో భూగర్భ పేలుడు
- అణుయేతర పదార్థాలతో తక్కువ స్థాయి విస్ఫోటనాల గుర్తింపునకు పరీక్షలు

వాషింగ్టన్: అణు పరీక్షలను మరింత కచ్చితంగా పసిగట్టే సామర్థ్యాన్ని పెంచుకునేందుకు అమెరికా కొత్త ప్రయోగం చేపట్టింది. నెవాడా నేషనల్ సెక్యూరిటీ సైట్‌లోని భూగర్భ ప్రాంతంలో ఈ ప్రయోగాన్ని నిర్వహించినట్లు అమెరికా ఇంధన శాఖ వెల్లడించింది. అయితే ఇది అణు పరీక్ష కాదని, అణుయేతర రసాయనిక పేలుడు పదార్థాలను ఉపయోగించి ప్రయోగాన్ని నిర్వహించినట్లు స్పష్టం చేసింది. తక్కువ స్థాయి అణు విస్ఫోటనాలను గుర్తించే సామర్థ్యాన్ని మెరుగుపరచడమే ప్రధాన లక్ష్యమని తెలిపింది. నెవాడాలోని ఏరియా–12లో ఉన్న 'పీ టన్నెల్'లో నిర్వహించిన ఈ ప్రయోగంలో అధిక శక్తి కలిగిన రసాయన పేలుడు పదార్థాలతో పాటు రేడియోట్రేసర్లను ఉపయోగించారు. అణు పేలుళ్లను గుర్తించే కంప్యూటర్ అల్గారిథమ్‌లను మరింత సమర్థంగా తీర్చిదిద్దేందుకు ఈ పరీక్ష నిర్వహించినట్లు తెలుస్తోంది. భూగర్భంలో జరిగే అణు పరీక్షలను గుర్తించడం అంత సులభం కాకుండా చేసేందుకు కొన్ని దేశాలు భారీ గుహలు, సొరంగాలను ఉపయోగిస్తుంటాయి. పేలుళ్ల వల్ల ఏర్పడే ప్రకంపనలు బయటకు ప్రసరించకుండా చేసే ఈ విధానాన్ని 'డీకప్లింగ్'గా వ్యవహరిస్తారు. ఇలాంటి రహస్య భూగర్భ అణు పరీక్షలను గుర్తించే సామర్థ్యాన్ని పెంచుకోవడమే తాజా ప్రయోగం ఉద్దేశంగా భావిస్తున్నారు. చైనా 2020లో రహస్యంగా అణు పరీక్ష నిర్వహించిందని అమెరికా గతంలో ఆరోపించగా.. బీజింగ్ ఆ ఆరోపణలను ఖండించింది. అవి పూర్తిగా నిరాధారమైనవని పేర్కొంది.



ఇరాక్ నుంచి అమెరికా సేనల పూర్తి ఉపసంహరణ

బాగ్దాద్: ఇరాక్ నుంచి అమెరికా సైనిక బలగాలు పూర్తిగా వైదొలిగాయి. ఐసిస్‌పై పోరాటం కోసం 12 ఏళ్ల కిందట ప్రారంభమైన సైనిక మిషన్ తాజాగా ముగిసింది. ఇరు దేశాల మధ్య 2024లో కుదిరిన ఒప్పందంలో భాగంగా ఉత్తర ఇరాక్‌లోని ఇర్బిల్ వైమానిక స్థావరం నుంచి అమెరికా బలగాలు, సైనిక సామగ్రిని తరలించినట్లు పెంటగాన్ తెలిపింది. ఇకపై ఇరాక్ సైన్యానికి శిక్షణ, నిఘా సహకారం కొనసాగుతుందని వెల్లడించింది. అమెరికా సేనల నిష్క్రమణ దేశ సార్వభౌమత్వానికి, సైనిక సామర్థ్యం పెరుగుదలకు నిదర్శనమని ఇరాక్ ప్రభుత్వం పేర్కొంది. అయితే అమెరికా బలగాలు వెళ్లిపోవడంతో ఐసిస్ మళ్లీ పుంజుకునే అవకాశం ఉందని, ఇరాన్ అనుకూల మిలిటెంట్ గ్రూపులు మరింత చురుకయ్యే ప్రమాదం ఉందని కుర్దిష్ ప్రాంతాలతో పాటు మరికొన్ని చోట్ల ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. 2003లో ఇరాక్‌పై దాడి చేసిన అమెరికా సేనలు అప్పటి అధ్యక్షుడు సద్దాం హుస్సేన్‌ను పదవీచ్యుతుడిని చేశాయి.

సదుపాయాల కోసం ఫ్రాన్స్‌లో విద్యార్థుల ఆందోళన

- చెత్త బుట్టలకు నిప్పు
- పోలీసులపైకి వస్తువులు.. బాష్పవాయువు ప్రయోగం

పారిస్: పాఠశాలల్లో మెరుగైన సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఫ్రాన్స్‌లో విద్యార్థులు ఆందోళనకు దిగారు. పారిస్‌లో మంగళవారం నిర్వహించిన నిరసనల్లో కొందరు చెత్త బుట్టలకు నిప్పు పెట్టడంతో పాటు పోలీసులపైకి వస్తువులు విసిరారు. దీంతో పోలీసులు ఆందోళనకారులపై బాష్పవాయువును ప్రయోగించారు. టైమ్‌టేబుల్, తరగతి గదుల్లో విద్యార్థుల సంఖ్యను తగ్గించడం, ఉపాధ్యాయుల కొరత, ఉక్కుపోతగా ఉండే తరగతి గదులు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వారం రోజులుగా విద్యార్థులు నిరసనలు చేస్తున్నారు. తొలుత పారిస్ పరిసర ప్రాంతాల్లో ప్రారంభమైన ఆందోళనలు క్రమంగా దేశంలోని పలు నగరాలకు విస్తరించాయి. దేశవ్యాప్తంగా సుమారు మూడు లక్షల మంది నిరసన కవాతుల్లో పాల్గొన్నారని విద్యార్థి సంఘాలు తెలిపాయి. ''నగర శివార్లకు చెందిన మేము నిర్లక్ష్యానికి, విస్మరణకు గురయ్యాం. ఇక్కడ పరిస్థితులు అపరిశుభ్రంగా ఉన్నాయి'' అని విక్టోయిర్ అనే 16 ఏళ్ల విద్యార్థిని ఆవేదన వ్యక్తం చేసింది. విద్యార్థుల ఆందోళనల ప్రభావంతో దేశవ్యాప్తంగా 400 పాఠశాలలు ప్రభావితమైనట్లు విద్యా శాఖ వెల్లడించింది. ఈ నిరసనలకు సంబంధించి 440 మందిని అదుపులోకి తీసుకున్నట్లు హోం శాఖ మంత్రి లారెంట్ తెలిపారు.



ఇకపై పెన్-పేపర్‌కు స్వస్తి

- సీబీటీ విధానంలో నీట్ నిర్వహణకు కేంద్రం కసరత్తు
- నందన్ నీలేకని టాస్క్‌ఫోర్స్ నివేదిక తర్వాత తుది నిర్ణయం

న్యూఢిల్లీ: నీట్ ప్రవేశ పరీక్షను ఇకపై పెన్ అండ్ పేపర్ విధానంలో కాకుండా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో నిర్వహించేందుకు కేంద్రం కసరత్తు చేస్తోంది. ఇటీవల నీట్ ప్రశ్నపత్రం లీక్ కావడం, దీనిపై విద్యార్థుల నుంచి పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తం కావడంతో కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ జాతీయ స్థాయిలో వైద్య విద్య ప్రవేశ పరీక్షను సీబీటీ విధానంలో నిర్వహించే అంశాన్ని పరిశీలిస్తోంది. వచ్చే ఏడాది నుంచే నీట్‌ను సీబీటీ విధానంలో నిర్వహించాలని కేంద్రం గతంలో ప్రకటించినప్పటికీ, ప్రస్తుతం ఈ ప్రతిపాదన పరిశీలన దశలోనే ఉందని సంబంధిత అధికారులు తెలిపారు. ప్రభుత్వ పరీక్షల వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు నందన్ నీలేకని అధ్యక్షతన ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ నివేదిక అందిన తర్వాత తుది నిర్ణయం తీసుకోనున్నట్లు వెల్లడించారు. ఇప్పటి వరకు నీట్‌ను పెన్–పేపర్ విధానంలో నిర్వహిస్తున్నారు. అయితే జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) ఇప్పటికే పలు కీలక ప్రవేశ, అర్హత పరీక్షలను సీబీటీ విధానంలో నిర్వహిస్తోంది. ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష జేఈఈ–మెయిన్స్, సీయూఈటీ–యూజీ, పీజీ, యూజీసీ–నెట్, సీఎస్ఐఆర్–యూజీసీ–నెట్ తదితర పరీక్షలు కంప్యూటర్ ఆధారంగానే జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పరీక్షల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపా యాలను మరింత బలోపేతం చేసి, భవిష్యత్తులో అన్ని ప్రవేశ పరీక్షలను ఆన్‌లైన్ విధానంలోకి తీసుకురావాలని కేంద్రం యోచిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.



ఏఐ ఏజెంట్లపై టెక్ దిగ్గజాల స్వీయ పోలీసింగ్

- అంతర్గత, బాహ్య సమీక్షలకు అంగీకారం
- ఒప్పందంపై ట్రంప్ సమక్షంలో సంతకాలు

వాషింగ్టన్: దారి తప్పే కృత్రిమ మేధ (ఏఐ) ఏజెంట్లను నియంత్రించేందుకు టెక్ దిగ్గజాలు స్వీయ నియంత్రణకు అంగీకరించాయి. 'వాలంటరీ అకార్డ్' పేరుతో కుదిరిన ఈ ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సమక్షంలో సంతకాలు చేశారు. ఏఐ సాంకేతికతలపై పెరుగుతున్న భయాందోళనల నేపథ్యంలో వాషింగ్టన్‌లోని శ్వేతసౌధంలో ట్రంప్ టెక్ దిగ్గజాలతో సమావేశమయ్యారు. ఒప్పందంలో భాగంగా కంపెనీలు ఏఐ అభివృద్ధి, వినియోగంపై అంతర్గత, బాహ్య సమీక్షలు నిర్వహించనున్నాయి. సమావేశంలో అమెరికా ప్రతినిధుల సభ స్పీకర్ మైక్ జాన్సన్‌తో పాటు ఆంథ్రోపిక్ సీఈఓ డారియో అమోడేయీ, గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్, మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్, ఎన్‌విడియా సీఈఓ జెన్‌సెన్ హువాంగ్, ఓపెన్‌ఏఐ ప్రెసిడెంట్ గ్రెగ్ బ్రాక్‌మన్, ఎక్స్‌ఏఐ ప్రతినిధులు, స్పేస్‌ఎక్స్ వ్యవస్థాపకుడు ఎలాన్ మస్క్ పాల్గొన్నారు. సమావేశం అనంతరం ట్రంప్ మాట్లాడుతూ అకార్డ్‌లో భాగంగా కంపెనీలు నాలుగు ప్రధాన అంశాలపై స్వచ్ఛందంగా దృష్టి సారిస్తాయని తెలిపారు. ఒప్పందంలోని నైతిక ప్రమాణాలకు కట్టుబడి ఉండేలా పర్యవేక్షించేందుకు పది మందితో కమిటీని ఏర్పాటు చేయాలని ట్రంప్ ప్రతిపాదించారు. ఒప్పందంలో భాగంగా కంపెనీలు పటిష్ఠమైన అంతర్గత నియంత్రణ వ్యవస్థలను అమలు చేయడంతో పాటు అవి సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో పరిశీలించేందుకు స్వతంత్ర బాహ్య ఆడిటర్లతో కలిసి పనిచేస్తాయి. ప్రతి కంపెనీ తమ బోర్డు ఆఫ్ డైరెక్టర్ల సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేసి అంతర్గత, బాహ్య ఆడిటర్ల నివేదికలను మూల్యాంకనం చేయనుంది. కాలక్రమేణా ఈ స్వచ్ఛంద చర్యలను చట్టాలు, నిబంధనల రూపంలోకి తీసుకురావాలని నిర్ణయించారు. టెక్ దిగ్గజాలతో ట్రంప్ నిర్వహించిన మధ్యాహ్న భోజన సమావేశంలో ఎన్‌విడియా సీఈఓ జెన్‌సెన్ హువాంగ్ ఆయన కుడివైపు, ఎలాన్ మస్క్ ఎడమవైపు కూర్చున్నారు. ఈ సందర్భంగా సుందర్ పిచాయ్‌ను ట్రంప్ వినూత్నంగా పరిచయం చేస్తూ 'మంచి మాన్‌స్టర్'గా అభివర్ణించారు. అలాగే డేటా సెంటర్లు అద్భుతంగా ఉన్నాయని ప్రశంసించారు.



దక్షిణాసియన్లపై ఆన్‌లైన్ ద్వేషం

- 240 శాతం పెరుగుదల
- భారతీయులపై వర్ణ వివక్షకు హెచ్-1బీ వీసాలపై అపోహలే కారణం
- సీఎస్‌వోహెచ్ నివేదిక

వాషింగ్టన్: అమెరికాలో స్థిరపడిన దక్షిణాసియా వాసులు, ముఖ్యంగా భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్ సంతతికి చెందిన నిపుణులపై ఆన్‌లైన్‌లో ద్వేషపూరిత వ్యాఖ్యలు, వర్ణ వివక్ష తీవ్రత పెరిగినట్లు 'సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ ఆర్గనైజ్డ్ హేట్' (సీఎస్‌వోహెచ్) తాజా నివేదిక వెల్లడించింది. వాషింగ్టన్ డీసీ కేంద్రంగా పనిచేస్తున్న ఈ సంస్థ ప్రకారం ప్రముఖ సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో దక్షిణాసియా వ్యతిరేక పోస్టులు 240 శాతం పెరిగాయి. 2024 జనవరిలో నెలకు సగటున 12,904గా ఉన్న విద్వేషపూరిత పోస్టుల సంఖ్య 2026 జూన్ నాటికి 43,843కు చేరింది. 2025 జనవరి నుంచి 2026 జూన్ వరకు ఐదు లక్షలకు పైగా ఇటువంటి పోస్టులు వెలువడి నట్లు నివేదిక పేర్కొంది. భారత సంతతికి చెందిన అమెరికన్ ప్రముఖులు వివేక్ రామస్వామి, శ్రీరామ్ కృష్ణన్, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ హెచ్–1బీ వీసాలకు మద్దతుగా మాట్లాడిన తర్వాత ఆన్‌లైన్ విద్వేషం మరింత పెరిగినట్లు తెలిపింది. అదే సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నాయకత్వంలో అమలైన కఠిన వలస విధానాలు, వలస కార్మికులపై చర్యలు, 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' ఉద్యమ ప్రభావం వంటివి కూడా ఈ ధోరణికి దోహదప డ్డాయని నివేదిక పేర్కొంది. హెచ్–1బీ వీసాదారుల్లో 70 శాతానికిపైగా భారతీయులే ఉండ టంతో.. దక్షిణాసియా వాసులు అమెరికన్ల ఉద్యోగాల ను కొల్లగొడుతున్నారనే అపోహలను వ్యాప్తి చేస్తూ కొందరు నెటిజన్లు ద్వేషపూరిత వ్యాఖ్యలు చేస్తున్నట్లు వివరించింది.

అమెరికాకే నష్టం:

ఈ పరిణామాలపై పలువురు అంతర్జాతీయ నిపుణులు స్పందించారు. విదేశీ వ్యవహారాల శాఖ మాజీ దౌత్యవేత్త రాజీవ్ డోగ్రా మాట్లాడుతూ రాజకీయ నాయకుల వివాదాస్పద వ్యాఖ్యలు సమాజంలోని కొన్ని వర్గాలను రెచ్చగొట్టే అవకాశం ఉందన్నారు. అమెరికా ఐటీ, కృత్రిమ మేధ రంగాల అభివృద్ధిలో భారతీయులు కీలక పాత్ర పోషిస్తున్నారని, వారిపై ద్వేషపూరిత వాతావరణం నెలకొంటే వారి మనోధైర్యం దెబ్బతినడంతో పాటు చివరకు అమెరికా ఆర్థిక ప్రయోజనాలపైనా ప్రభావం పడొచ్చని అభిప్రాయపడ్డారు. జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ అన్షు జోషి మాట్లాడుతూ అమెరికా–భారత్ సంబంధాల్లో ప్రజల మధ్య అనుబంధం ప్రధాన మూలస్తంభమని పేర్కొన్నారు. దక్షిణాసియా వాసులపై విద్వేషపూరిత పోస్టులు పెరగడం అమెరికాలోని భారతీయ సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు.




గోధుమలు, శనగల ఎంఎస్‌పీకి స్వల్ప పెంపు

న్యూఢిల్లీ: 2027–28 రబీ సీజన్‌కు ఆరు ప్రధాన పంటల కనీస మద్దతు ధరలను కేంద్ర ప్రభుత్వం పెంచింది. ఇందులో గోధుమల ఎంఎస్‌పీని క్వింటాలుకు రూ.25 పెంచి రూ.2,610గా, శనగల మద్దతు ధరను రూ.83 పెంచి రూ.5,958గా నిర్ణయించింది. కుసుమలకు రూ.7,215, బార్లీకి రూ.2,286, మసూర్‌దాల్‌కు రూ.7,390, ఆవాలకు రూ.6,613గా ఎంఎస్‌పీ ఖరారు చేసింది. 2026–27 రబీ సీజన్‌లో శనగల మద్దతు ధరను రూ.225, గోధుమలను రూ.160 మేర పెంచగా.. ఈసారి ఆ స్థాయిలో పెంపు కనిపించలేదు. కుసుమల ఎంఎస్‌పీని గత సీజన్‌లో రూ.600 పెంచగా.. ఈసారి రూ.675 మేర పెంచారు. కుసుమ, ఆవాలు మినహా మిగిలిన పంటల ఎంఎస్‌పీ గత ఏడాదితో పోలిస్తే తక్కువగా పెరిగింది. దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఉత్పత్తయ్యే 135 గిగావాట్ల పునరుత్పాదక ఇంధనాన్ని అంతర్గతంగా సరఫరా చేసేందుకు గ్రీన్ ఎనర్జీ కారిడార్–3 ఏర్పాటుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పీఎం–ధారా పథకం కింద ఈ ప్రాజెక్టుకు రూ.1,86,405 కోట్లు వెచ్చించనున్నారు. ఇందులో పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి కేంద్రాల వద్ద లేదా గ్రిడ్‌కు అనుకూలమైన ఇతర ప్రాంతాల్లో 50 గిగావాట్ల సామర్థ్యంతో బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ (బీఈఎస్ఎస్) ఏర్పాటు చేయనున్నారు. 2032–33 నాటికి ఈ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. మొత్తం వ్యయంలో రూ.1.36 లక్షల కోట్లు అంతర్‌రాష్ట్ర ప్రసార వ్యవస్థ అభివృద్ధికి, రూ.50 వేల కోట్లు 50 గిగావాట్ల బ్యాటరీ నిల్వ సామర్థ్యం ఏర్పాటుకు కేటాయించనున్నారు.

ఇంధన నౌకపై పైరేట్ల దాడి

- ఐదుగురు సిబ్బంది హతం
- మృతుల్లో భారతీయ నావికుడు, ముగ్గురు పాకిస్థానీలు
- మరో నౌకను విడిచిపెట్టిన దుండగులు

సోమాలియా: సోమాలియా సముద్రపు దొంగలు ఓ ఇంధన నౌకను హైజాక్ చేసి అందులోని ఐదుగురు సిబ్బందిని హతమార్చారు. మృతుల్లో ఒక భారతీయ నావికుడు, ముగ్గురు పాకిస్థానీలు, ఒక మయన్మార్ పౌరుడు ఉన్నారు. మరో భారతీయుడితో పాటు ముగ్గురు పాకిస్థానీలు గాయపడ్డారు. సోమాలియాలోని పుంట్‌ల్యాండ్ తీరంలో నౌకను తమ ఆధీనంలోకి తీసుకునేందుకు భద్రతా బలగాలు ప్రయత్నిస్తున్న సమయంలో పైరేట్లు ఈ ఘాతుకానికి పాల్పడినట్లు సమాచారం. భారతీయ నావికుడు మృతి చెందడంపై కెన్యాలోని భారత హైకమిషన్ సంతాపం తెలిపింది. యూరోపియన్ యూనియన్ నౌకాదళం వెల్లడించిన వివరాల ప్రకారం.. పలావు జెండాతో సోమాలియా రాజధాని మొగదీషు వైపు వెళ్తున్న 'ఎమ్‌టీ హానర్ 25' ఇంధన నౌకను ఈ ఏడాది ఏప్రిల్‌లో సముద్రపు దొంగలు హైజాక్ చేశారు. ఆ సమయంలో నౌకలో సుమారు 17 మంది సిబ్బంది ఉన్నట్లు సమాచారం. భద్రతా బలగాలు చేపట్టిన ఆపరేషన్‌లో 16 మంది అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. మరోవైపు టోగో జెండాతో ప్రయాణిస్తున్న 'ఎమ్‌టీ యురేకా' ఇంధన నౌకను కూడా సముద్రపు దొంగలు హైజాక్ చేయగా.. తాజాగా దాన్ని విడిచిపెట్టి 12 మంది సిబ్బందిని స్థానికులకు అప్పగించారు. వారిలో ఎనిమిది మంది ఈజిప్ట్ జాతీయులు, నలుగురు భారతీయులు ఉన్నారు. అయితే పైరేట్లు అక్కడి నుంచి పారిపోయే ముందు నౌకను ధ్వంసం చేసి నిప్పంటించారు. సుమారు 20,400 బ్యారెల్ల ఇంధనంతో ప్రయాణిస్తున్న ఈ నౌకను మేలో యెమన్‌లోని ఖానా ఓడరేవు సమీపంలో హైజాక్ చేసినట్లు అధికారులు తెలిపారు. గత వారం కూడా 'ఎమ్‌టీ శిబు 1' అనే మరో నౌకను పైరేట్లు విడిచిపెట్టారు. ఆ నౌకలో 16 మంది భారతీయ సిబ్బంది ఉన్నారు.



మరో రెండు స్వర్ణాలపై గురి

• హాకీ, క్రికెట్‌లో టైటిల్ పోరుకు • ఆసియా క్రీడల్లో 13వ రోజు ఆరు పతకాలు సాధించిన భారత్
• రెజ్లింగ్, సెయిలింగ్‌లో రజతాలు.. స్క్వాష్, ఆర్చరీలో కాంస్యాలు • 64 పతకాలతో ఎనిమిదో స్థానం



నగోయా: ఆసియా క్రీడల్లో భారత్ మరో రెండు స్వర్ణాలపై గురిపెట్టింది. గురువారం 13వరోజు ఆరు పతకాలు ఖాతాలో వేసుకున్న భారత్.. హాకీ, క్రికెట్‌లో ఫైనల్‌కు చేరడం ద్వారా మరో రెండు స్వర్ణాలపై ఆశలు పెంచుకుంది. సెపక్ తక్రాలోనూ పతకం ఖాయం కావడంతో శుక్రవారం భారత పతకాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. జపాన్‌లోని ఐచి–నగోయా వేదికగా జరుగుతున్న ఆసియా క్రీడల్లో భారత్ పతకాల వేట కొనసాగుతోంది. గురువారం రెజ్లింగ్, సెయిలింగ్, స్క్వాష్, ఆర్చరీల్లో భారత క్రీడాకారులు పతకాలు సాధించగా.. పురుషుల హాకీ, టీ20 క్రికెట్ జట్లు ఫైనల్‌కు దూసుకెళ్లాయి. దీంతో భారత్ పతకాల సంఖ్య మరింత పెరిగింది. గురువారం అధికారికంగా ఆరు పతకాలు భారత్ ఖాతాలో చేరాయి. ఇందులో రెండు రజతాలు, నాలుగు కాంస్యాలు ఉన్నాయి. అయితే సెయిలింగ్‌లో సాధించిన రెండు పతకాలను కొన్ని తాజా పతకాల పట్టికలు అధికారిక లెక్కల్లో ఇంకా చేర్చలేదు.

రెజ్లింగ్‌లో చరిత్రాత్మక రజతం

పురుషుల 97 కేజీల గ్రీకో–రోమన్ రెజ్లింగ్‌లో నితేశ్ సియాచ్చ్ రజత పతకం సాధించాడు. ఫైనల్లో జపాన్‌కు చెందిన యూరి నకాజాటో చేతిలో 0–4తో ఓడినప్పటికీ.. ఆసియా క్రీడల గ్రీకో–రోమన్ రెజ్లింగ్‌లో భారత్‌కు తొలి రజతాన్ని అందించాడు. సెయిలింగ్‌లోనూ భారత్‌కు ఒక రజతం, ఒక కాంస్యం దక్కాయి. పురుషుల స్కిఫ్ విభాగంలో మను ఫ్రాన్సిస్–ప్రిన్స్ కురుసింకల్ నోబుల్ జోడీ రజతం సాధించింది. మహిళల స్కిఫ్‌లో హర్షితా తోమర్–శీతల్ వర్మ జోడీ కాంస్య పతకాన్ని అందుకుంది. స్క్వాష్‌లో పురుషుల, మహిళల జట్లు కాంస్య పతకాలు సాధించాయి. పురుషుల జట్టు సెమీఫైనల్లో మలేసియాతో 1–2తో ఓడగా.. మహిళల జట్టు హాంకాంగ్ చైనాతో జరిగిన సెమీఫైనల్లో 1–2తో పరాజయం పాలైంది. దీంతో రెండు జట్లకూ కాంస్యాలు లభించాయి. ఆర్చరీ పురుషుల వ్యక్తిగత కాంపౌండ్ విభాగంలో గణేశ్ మణిరత్నం తిరుమూరు కాంస్య పతకం సాధించాడు. మరోవైపు సెపక్ తక్రాలో పురుషుల క్వాడ్రంట్ జట్టు సెమీఫైనల్‌కు చేరుకోవడంతో భారత్‌కు మరో పతకం ఖాయమైంది.

పాక్‌పై ఉత్కంఠ విజయం

పురుషుల హాకీ సెమీఫైనల్లో పాకిస్థాన్‌పై భారత్ 4–3తో ఉత్కంఠభరిత విజయం సాధించి ఫైనల్‌కు చేరింది. ఒక దశలో భారత్ 3–0 ఆధిక్యంలో ఉన్నా.. పాకిస్థాన్ వరుస గోల్స్‌తో స్కోరును 3–3తో సమం చేసింది. మ్యాచ్ ముగియడానికి కేవలం 45 సెకన్ల ముందు అభిషేక్ గోల్ చేయడంతో భారత్ విజయం ఖరారైంది. పురుషుల టీ20 క్రికెట్ సెమీఫైనల్లో భారత్ 124 పరుగుల భారీ తేడాతో శ్రీలంకను ఓడించింది. ఈ విజయంతో భారత జట్టు ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. దీంతో హాకీతో పాటు క్రికెట్‌లోనూ భారత్‌కు స్వర్ణ పతక అవకాశాలు సజీవంగా ఉన్నాయి.

పలు విభాగాల్లో నిరాశ

మహిళల 62 కేజీల రెజ్లింగ్‌లో మాన్సీ అహ్లావత్ కాంస్య పతక పోరులో ఓడింది. జూడోలో ఇనుంగన్ బి తఖెల్లంబమ్ కూడా కాంస్య బౌట్‌లో పరాజయం పాలైంది. టెన్నిస్ పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో సుమిత్ నాగల్ చైనాకు చెందిన వు యిబింగ్ చేతిలో ఓడటంతో భారత్ పతక ఆశలు ముగిశాయి. పురుషుల వాలీబాల్‌లో క్వార్టర్ ఫైనల్లో పాకిస్థాన్ చేతిలో భారత్ పరాజయం పాలైంది. రగ్బీ సెవెన్స్‌లో హాంకాంగ్ చైనా చేతిలోనూ భారత్ ఓడింది. షూటింగ్‌లో అనీష్ భన్వాలా ఏడో స్థానంతో సరిపెట్టుకున్నాడు. గురువారం పోటీలు ముగిసే సమయానికి అధికారిక పతకాల పట్టికలో భారత్ 10 స్వర్ణాలు, 22 రజతాలు, 32 కాంస్యాలతో మొత్తం 64 పతకాలతో ఎనిమిదో స్థానంలో ఉంది. 154 స్వర్ణాలతో కలిపి 288 పతకాలు సాధించిన చైనా అగ్రస్థానంలో ఉంది. జపాన్ 217 పతకాలతో రెండో స్థానంలో, దక్షిణ కొరియా 113 పతకాలతో మూడో స్థానంలో ఉన్నాయి. ఉజ్బెకిస్థాన్, ఇరాన్, థాయ్‌లాండ్, బహ్రెయిన్ భారత్ కంటే ముందున్నాయి.



బ్యాట్–బంతి మధ్య సమతుల్యతే లక్ష్యం

• కొత్త నిబంధనలపై ఎంసీసీ హెడ్ ఆఫ్ క్రికెట్ ఫ్రేసర్ స్టీవార్ట్
• 73 నిబంధనల్లో సవరణలు.. గురువారం నుంచి అమలు
• నిబంధనలపై అవగాహనకు ప్రత్యేక యాప్

న్యూఢిల్లీ: క్రికెట్‌లో బ్యాట్, బంతి మధ్య సమతుల్యతను కొనసాగించడమే తమ లక్ష్యమని మరైల్‌బోన్ క్రికెట్ క్లబ్ (ఎంసీసీ) హెడ్ ఆఫ్ క్రికెట్ ఫ్రేసర్ స్టీవార్ట్ తెలిపారు. ఆటలో మార్పులకు అనుగుణంగా నిబంధనలను సవరించినప్పటికీ.. బ్యాటర్, బౌలర్ మధ్య సమతుల్యతకు ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. గురువారం నుంచి కొత్త క్రికెట్ నిబంధనలు అమల్లోకి రానున్న నేపథ్యంలో ఢిల్లీలో నిర్వహించిన అంపైర్ల వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. క్రికెట్ నిబంధనల్లో దాదాపు 73 మార్పులు చేసినట్లు స్టీవార్ట్ వెల్లడించారు. ఎర్ర బంతితో జరిగే మ్యాచ్‌ల్లో చివరి ఓవర్ సమయంలో వికెట్ పడితే.. ఆ ఓవర్‌లో మిగిలిన బంతులను ఎదుర్కొనేందుకు తదుపరి బ్యాటర్ మైదానంలోకి రావాల్సి ఉంటుందని వివరించారు. కొత్త నిబంధనల ఉద్దేశం ఆటను మరింత స్పష్టంగా, సమర్థంగా నిర్వహించడమేనని తెలిపారు.

ప్రత్యేక యాప్ అందుబాటులోకి

కొత్త నిబంధనలపై ఆటగాళ్లు, అంపైర్లు, అభిమానులు సహా క్రికెట్ వర్గాలందరికీ అవగాహన కల్పించేందుకు ఎంసీసీ 'అఫీషియల్ లాస్ ఆఫ్ క్రికెట్' పేరుతో ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. పలు భాషల్లో ఈ యాప్ సేవలను అందిస్తోంది. తెలుగువాడైన శ్రీకాంత్ టంగుటూరికి చెందిన రీబుల్ సంస్థ ఈ యాప్‌ను రూపొందించింది. కొత్త నిబంధనలపై మరింత అవగాహన కల్పించేందుకు అక్టోబర్ మొదటి వారంలో దేశంలోని పలు నగరాల్లో ఎంసీసీ సెమినార్లు నిర్వహించనుంది. అంపైర్లు, కోచ్‌లు, ఆటగాళ్లు, ఇతర క్రికెట్ వర్గాలకు నిబంధనల్లో చేసిన మార్పులను వివరించనున్నారు.

డే టెస్టుల్లో పింక్ బాల్.. ఐసీసీ ప్రయోగం

• వెలుతురు తగ్గితే ఆటకు అంతరాయం లేకుండా కొత్త నిబంధన
• మ్యాచ్‌కు ముందే ఇరు జట్ల అంగీకారం తప్పనిసరి
• టైమ్ వేస్టింగ్‌పై మూడోసారి 5 పరుగుల పెనాల్టీ



దుబాయ్: డే టెస్టుల్లో వెలుతురు తగ్గడం కారణంగా ఆటకు అంతరాయం ఏర్పడకుండా ఉండేందుకు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) కొత్త నిబంధనలను తీసుకొచ్చింది. ఇందులో భాగంగా పింక్ బాల్‌తో టెస్టు మ్యాచ్‌లు నిర్వహించేందుకు ప్రయోగాత్మకంగా అనుమతించింది. అక్టోబర్ 1 లేదా ఆ తర్వాత ప్రారంభమయ్యే అన్ని అంతర్జాతీయ సిరీస్‌లకు ఈ నిబంధనలు వర్తించనున్నాయి. టెస్టులో పింక్ బాల్‌ను ఉపయోగించాలంటే ఇరు జట్ల మ్యాచ్‌కు ముందే పరస్పర అంగీకారానికి రావాలి. ఒకసారి పింక్ బాల్‌తో మ్యాచ్ నిర్వహించాలని నిర్ణయించిన తర్వాత.. మ్యాచ్ పూర్తయ్యే వరకు అదే బంతిని ఉపయోగించాలి. మ్యాచ్ ప్రారంభమైన అనంతరం ఎరుపు బంతి నుంచి పింక్ బాల్‌కు మారేందుకు అవకాశం ఉండదు.

గువాహటి టెస్టుకు వర్తించే అవకాశం

సూర్యాస్తమయం త్వరగా జరిగే ప్రాంతాల్లో ఈ విధానం ఉపయోగపడే అవకాశం ఉంది. తొలి సెషన్ తర్వాత వెలుతురు తగ్గే పరిస్థితులు ఉన్న వేదికల్లో పింక్ బాల్‌తో ఆటను కొనసాగించేందుకు వీలుంటుంది. ఈ నేపథ్యంలో భారత్–ఆస్ట్రేలియా బోర్డర్–గావస్కర్ ట్రోఫీలో గువాహటి టెస్టును పింక్ బాల్‌తో నిర్వహించే అవకాశం ఉంది. రోజు చివరి ఓవర్‌లో వికెట్ పడినంత మాత్రాన ఆటను వెంటనే ముగించే విధానంలోనూ ఐసీసీ మార్పు చేసింది. వాతావరణం, మైదాన పరిస్థితులు అనుకూలంగా ఉంటే.. ఆ ఓవర్‌లో మిగిలిన బంతులను అదేరోజు పూర్తి చేసేందుకు అవకాశం కల్పించింది. బ్యాటర్ ఉద్దేశపూర్వకంగా సమయం వృథా చేస్తే మొదటి, రెండోసారి అంపైర్ హెచ్చరిక జారీ చేస్తారు. మూడోసారి కూడా అదే తప్పిదం పునరావృతమైతే ఫీల్డింగ్ జట్టుకు 5 పరుగులను పెనాల్టీగా ఇవ్వనున్నారు. మహిళల, జూనియర్ క్రికెట్ కోసం ఇకపై నిర్దేశిత పరిమాణం, బరువుతో కూడిన బంతులను ఉపయోగించనున్నారు. కొత్త బంతి బరువు 142 నుంచి 149 గ్రాముల మధ్య, చుట్టుకొలత 21.5 నుంచి 22 సెంటీమీటర్ల మధ్య ఉండాలని ఐసీసీ పేర్కొంది. ఓవర్‌రేట్‌తో నిబంధనపైనా ఐసీసీ స్పష్టత ఇచ్చింది. పరుగులను అడ్డుకోవడం లేదా రనౌట్ చేయడం కోసం బంతిని స్టంప్స్ వైపు విసిరే ప్రయత్నాన్ని మాత్రమే ఓవర్‌రేట్‌గా పరిగణిస్తారు. బంతిని ఆపేందుకు లేదా మరో ఫీల్డర్‌కు అందించేందుకు చేసే సాధారణ మిస్‌ఫీల్డ్‌ను ఓవర్‌రేట్‌గా పరిగణించరు.



హెచ్‌డీఎఫ్‌సీ కొత్త సీఈవోగా అనూప్ బాగ్చీ

• అక్టోబర్ 27 నుంచి మూడేళ్లపాటు బాధ్యతలు



న్యూఢిల్లీ: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ), చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో)గా అనూప్ బాగ్చీ నియమితులయ్యారు. ఈ నియామకానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆమోదం తెలిపింది. అక్టోబర్ 27, 2026 నుంచి మూడేళ్లపాటు ఆయన ఈ బాధ్యతల్లో కొనసాగనున్నారు. ప్రస్తుతం ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ ఎండీ, సీఈవోగా పనిచేస్తున్న అనూప్ బాగ్చీ.. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రస్తుత ఎండీ, సీఈవో శశిధర్ జగదీశన్ స్థానాన్ని భర్తీ చేయనున్నారు. జగదీశన్ పదవీకాలం అక్టోబర్ 26తో ముగియనుంది. మరోసారి ఈ పదవిలో కొనసాగేందుకు ఆసక్తి లేదని ఆయన ఆగస్టులో బ్యాంక్ బోర్డుకు తెలియజేశారు.

అదనపు డైరెక్టర్‌గా నియామకం

అనూప్ బాగ్చీని అక్టోబర్ 2 నుంచి అదనపు డైరెక్టర్‌గా నియమించేందుకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ బోర్డు అక్టోబర్ 1న జరిగిన సమావేశంలో ఆమోదం తెలిపింది. ఆర్‌బీఐ ఆమోదించిన వేతనం, ఇతర నిబంధనలకు అనుగుణంగా మూడేళ్లపాటు ఎండీ, సీఈవోగా నియమించేందుకు కూడా బోర్డు అంగీకరించింది. అయితే ఈ నియామకం అమలులోకి రావాలంటే కంపెనీల చట్టంలోని నిబంధనల ప్రకారం బ్యాంక్ వాటాదారుల ఆమోదం పొందాల్సి ఉంటుంది.

పెట్రోల్, డీజిల్ అమ్మకాలపై పరిమితులొద్దు

• ప్రైవేట్ ఇంధన సంస్థలకు కేంద్రం స్పష్టీకరణ

న్యూఢిల్లీ: పెట్రోల్, డీజిల్ విక్రయాలపై ఎలాంటి పరిమితులు విధించొద్దని ప్రైవేట్ ఇంధన సంస్థలకు కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. కొన్ని ఔట్‌లెట్లలో కొనుగోలు పరిమితులు విధించిన జియో–బీపీ, నయారా ఎనర్జీకి ఈ విషయాన్ని తెలియజేయనున్నట్లు చమురు శాఖ కార్యదర్శి నీరజ్ మిట్టల్ తెలిపారు. రిటైల్, బల్క్ డీజిల్ ధరల మధ్య లీటరుకు రూ.50 వరకు వ్యత్యాసం ఉండటంతో పారిశ్రామిక సంస్థలు, టెలికాం కంపెనీలు, హోటళ్లు, ఆసుపత్రులు తదితర భారీ వినియోగదారులు పెట్రోల్ బంకుల నుంచి డీజిల్ కొనుగోలు చేస్తున్నారు. కొందరు ఒకేసారి 400–600 లీటర్ల వరకు కొనుగోలు చేస్తున్నట్లు పరిశ్రమ వర్గాలు తెలిపాయి.

బంకుల్లో నిల్వలపై ఒత్తిడి

పెద్ద మొత్తంలో కొనుగోళ్లతో సాధారణ వాహనదారులకు ఉద్దేశించిన బంకుల్లో ఇంధన నిల్వలపై ఒత్తిడి పెరుగుతోంది. జియో–బీపీ కొన్ని ఔట్‌లెట్లలో రోజుకు 50 లీటర్లు, నయారా 70–200 లీటర్ల వరకు కొనుగోలు పరిమితులు విధించాయి. ఇంధన సరఫరాలు కొనసాగుతున్నాయని రెండు సంస్థలు తెలిపాయి. రిటైల్ పెట్రోల్, డీజిల్ ధరలు మే నుంచి మారకపోగా.. అంతర్జాతీయ ధరలకు అనుసంధానమైన బల్క్ ఇంధన ధరలు పెరిగి ఈ వ్యత్యాసం ఏర్పడింది.

జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓకు తుది మెరుగులు

• రూ.3.4 లక్షల కోట్లకుపైగా విలువైన పబ్లిక్ ఆఫర్ • అమెరికా, బ్రిటన్ సహా ఐదు దేశాల్లో రోడ్‌షోలు పూర్తి • రూ.27,500 కోట్ల రుణాల చెల్లింపునకు ఐపీఓ నిధులు


న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన డిజిటల్ సేవల సంస్థ జియో ప్లాట్‌ఫామ్స్ ప్రతిపాదిత ఐపీఓకు తుది మెరుగులు దిద్దుతోంది. సుమారు 3.8 బిలియన్ డాలర్ల (రూ.3.4 లక్షల కోట్లకుపైగా) విలువైన ఈ పబ్లిక్ ఆఫర్ దేశంలోనే అతిపెద్ద ఐపీఓగా నిలిచే అవకాశం ఉంది. సంభావ్య పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు ప్రపంచవ్యాప్తంగా నిర్వహించిన రోడ్‌షోల తొలి దశను కంపెనీ పూర్తి చేసినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. జియో ప్లాట్‌ఫామ్స్ మేనేజింగ్ డైరెక్టర్, రిలయన్స్ జియో చైర్మన్ ఆకాశ్ అంబానీ, రిలయన్స్ రిటైల్ వెంచర్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఈషా అంబానీ రోడ్‌షోలకు నేతృత్వం వహించారు. అమెరికా, బ్రిటన్, దుబాయ్, సింగపూర్, హాంకాంగ్‌లలో సంభావ్య పెట్టుబడిదారులతో సమావేశాలు నిర్వహించినట్లు సమాచారం. రోడ్‌షోల తొలి దశ పూర్తికావడంతో రెడ్ హెరింగ్ ప్రాస్పెక్టస్ (ఆర్‌హెచ్‌పీ) దాఖలుకు సన్నాహాలు ప్రారంభించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

ఆగస్టు 28నే సెబీ పరిశీలనలు

జియో ప్లాట్‌ఫామ్స్ సమర్పించిన డ్రాఫ్ట్ రెడ్ హెరింగ్ ప్రాస్పెక్టస్ (డీఆర్‌హెచ్‌పీ)కు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఆగస్టు 28న తుది పరిశీలనలను జారీ చేసింది. అంతకు ముందు జూన్ 19న కంపెనీ ఐపీఓకు సంబంధించిన ముసాయిదా పత్రాలను దాఖలు చేసింది. డీఆర్‌హెచ్‌పీ ప్రకారం.. గరిష్ఠంగా 27 కోట్ల కొత్త ఈక్విటీ షేర్లను జారీ చేయాలని కంపెనీ ప్రతిపాదించింది. ఇవి ఐపీఓ అనంతరం మొత్తం ఈక్విటీ మూలధనంలో సుమారు 2.9 శాతానికి సమానం. ఇదిలాఉంటే ఐపీఓ ద్వారా సమీకరించే నిధుల్లో ప్రధాన భాగాన్ని జియో ప్లాట్‌ఫామ్స్ కీలక అనుబంధ సంస్థ రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ రుణాల చెల్లింపునకు వినియోగించనున్నారు. సుమారు రూ.27,500 కోట్ల బకాయి రుణాలను పూర్తిగా లేదా పాక్షికంగా చెల్లించేందుకు నిధులను ఉపయోగించాలని డీఆర్‌హెచ్‌పీలో ప్రతిపాదించారు. మిగిలిన మొత్తాన్ని సాధారణ కార్పొరేట్ అవసరాలకు కేటాయించనున్నారు.

రూ.1.47 లక్షల కోట్ల ఆదాయం

2025–26 ఆర్థిక సంవత్సరంలో జియో ప్లాట్‌ఫామ్స్ పన్నుల అనంతర లాభం 15 శాతం పెరిగి రూ.30,053 కోట్లకు చేరింది. ఇదే కాలంలో సంస్థ వార్షిక ఆదాయం 14.5 శాతం వృద్ధితో రూ.1,46,885 కోట్లుగా నమోదైంది. జియో ప్లాట్‌ఫామ్స్‌లో రిలయన్స్ గ్రూప్ డిజిటల్, టెలికాం వ్యాపారాలు ఉన్నాయి. డీఆర్‌హెచ్‌పీ ప్రకారం.. రిలయన్స్ జియో ఇన్ఫోకామ్‌కు మొబైల్ కనెక్షన్లలో 39.29 శాతం మార్కెట్ వాటా, 50.6 కోట్ల మంది వినియోగదారులు ఉన్నారు. ఫిక్స్‌డ్‌లైన్ కనెక్షన్లలో 32.89 శాతం వాటాతో 15.79 కోట్ల మంది వినియోగదారులను కలిగి ఉంది.



2020లో భారీ పెట్టుబడులు

2020లో జియో ప్లాట్‌ఫామ్స్‌లో మెటా రూ.43,574 కోట్లు పెట్టుబడి పెట్టి 9.99 శాతం వాటాను, గూగుల్ రూ.33,737 కోట్లు పెట్టుబడి పెట్టి 7.73 శాతం వాటాను సొంతం చేసుకున్నాయి. సిల్వర్ లేక్, విస్టా ఈక్విటీ పార్ట్నర్స్, జనరల్ అట్లాంటిక్, కేకేఆర్, ముబాదలా తదితర సంస్థలు కూడా కలిపి సుమారు రూ.74,745 కోట్ల పెట్టుబడులు పెట్టాయి. డీఆర్‌హెచ్‌పీ ప్రకారం.. జియో ప్లాట్‌ఫామ్స్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు సుమారు 66.4 శాతం, మెటా, గూగుల్‌కు కలిపి సుమారు 17.7 శాతం వాటా ఉంది. 2008 తర్వాత రిలయన్స్ గ్రూప్ నుంచి రానున్న తొలి ఐపీఓ ఇదే.

తగ్గిన యూపీఐ లావాదేవీలు

• ఆగస్టుతో పోలిస్తే 1.8శాతం తగ్గుదల

ముంబై: దేశంలో డిజిటల్ చెల్లింపులకు ప్రధాన వేదికగా మారిన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలు సెప్టెంబరులో స్వల్పంగా తగ్గాయి. రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గురువారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. సెప్టెంబరులో మొత్తం 2,407 కోట్ల యూపీఐ లావాదేవీలు జరిగాయి. ఆగస్టులో నమోదైన 2,450 కోట్లతో పోలిస్తే 1.8 శాతం తగ్గుదల నమోదైంది. సెప్టెంబరులో యూపీఐ ద్వారా జరిగిన లావాదేవీల మొత్తం విలువ రూ.29.37 లక్షల కోట్లుగా నమోదైంది. ఆగస్టులో ఇది రూ.29.82 లక్షల కోట్లు. దీంతో నెలవారీగా లావాదేవీల విలువ 1.50 శాతం తగ్గింది. యూపీఐ వ్యవస్థను నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) నిర్వహిస్తోంది. నెలవారీగా లావాదేవీల సంఖ్య తగ్గినప్పటికీ.. రోజువారీ సగటు లావాదేవీల్లో మాత్రం పెరుగుదల నమోదైంది. ఆగస్టులో 31 రోజులు ఉండగా.. సెప్టెంబరులో 30 రోజులే ఉన్నాయి. దీంతో నెల మొత్తం లావాదేవీల సంఖ్యలో తగ్గుదల కనిపించినట్లు పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి. ఆగస్టులో రోజుకు సగటున 79.1 కోట్ల యూపీఐ లావాదేవీలు జరగ్గా.. సెప్టెంబరులో ఈ సంఖ్య 80.2 కోట్లకు పెరిగింది. ఎన్‌పీసీఐ నిర్వహించే ఇమ్మీడియట్ పేమెంట్ సర్వీస్ (ఐఎంపీఎస్) ద్వారా సెప్టెంబరులో 35.40 కోట్ల లావాదేవీలు జరిగాయి. వీటి మొత్తం విలువ రూ.7.05 లక్షల కోట్లుగా నమోదైంది.



ఆర్‌టీజీఎస్, నెఫ్ట్ ఇలా..

రిజర్వ్ బ్యాంక్ నిర్వహించే రియల్‌టైమ్ గ్రాస్ సెటిల్‌మెంట్ (ఆర్‌టీజీఎస్) వ్యవస్థలో సెప్టెంబరులో 3.25 కోట్ల లావాదేవీలు జరిగాయి. వీటి మొత్తం విలువ రూ.235.71 లక్షల కోట్లుగా ఉంది. నేషనల్ ఎలక్ట్రానిక్ ఫండ్స్ ట్రాన్స్‌ఫర్ (నెఫ్ట్) ద్వారా 86.2 కోట్ల లావాదేవీలు జరగ్గా.. వాటి విలువ రూ.46.75 లక్షల కోట్లుగా నమోదైంది. అధిక విలువ కలిగిన యూపీఐ లావాదేవీలపై కొత్త మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) రుసుము అమల్లోకి రావడానికి సుమారు రెండు వారాల ముందు ఈ గణాంకాలు వెలువడ్డాయి. డిజిటల్ చెల్లింపుల రంగంలో మారుతున్న లావాదేవీల ధోరణిని ఈ గణాంకాలు ప్రతిబింబిస్తున్నాయి.

నాలుగో రోజూ మార్కెట్లు డౌన్

• 570 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్.. 22,422 వద్ద నిఫ్టీ

ముంబై: విదేశీ నిధుల ఉపసంహరణ, పెరిగిన బాండ్ ఈల్డ్స్, ముడిచమురు ధరల ప్రభావంతో దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగో రోజూ నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 570.59 పాయింట్లు కోల్పోయి 71,909.70 వద్ద, నిఫ్టీ 198.50 పాయింట్లు తగ్గి 22,421.95 వద్ద స్థిరపడ్డాయి. బుధవారం విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు రూ.10,148 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. మరోవైపు బ్రెంట్ క్రూడ్ ధర 2.77 శాతం పెరిగి బ్యారెల్‌కు 100.8 డాలర్లకు చేరింది. మారుతి, ఎంఅండ్ఎం, టాటా స్టీల్, అదానీ పోర్ట్స్ తదితర షేర్లు నష్టపోగా.. ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లాభాల్లో నిలిచాయి.






రజినీ 'ధర్మన్'లో శ్రీలీల?

టాలీవుడ్ డ్యాన్సింగ్ సెన్సేషన్ శ్రీలీలకు కొంతకాలంగా అదృష్టం అంతగా కలిసి రావడం లేదనే టాక్ వినిపిస్తోంది. ఆమె నటించిన కొన్ని సినిమాలు ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో వరుస అవకాశాలు కొంతమేర తగ్గినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో శ్రీలీలకు అనూహ్యంగా ఓ భారీ అవకాశం దక్కినట్లు సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి. సూపర్‌స్టార్ రజినీకాంత్ హీరోగా తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'ధర్మన్'లో శ్రీలీల కీలక పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. సాంప్రదాయ దుస్తుల్లో శ్రీలీల కనిపిస్తున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో లీకై వైరల్ కావడంతో ఈ ప్రచారానికి మరింత బలం చేకూరింది. దర్శకుడు అశ్వత్ మారిముత్తు ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న ఈ భారీ మల్టీస్టారర్‌ను యూనివర్సల్ స్టార్ కమల్ హాసన్‌కు చెందిన రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ సంస్థ, టర్మరిక్ మీడియాతో కలిసి సంయుక్తంగా నిర్మిస్తోంది. ఈ చిత్రంలో సీనియర్ హీరోయిన్ సిమ్రాన్, రాశి ఖన్నా, కమెడియన్ యోగిబాబు, రామ్ పోతినేని కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే 'స్కంద' చిత్రంలో జోడీగా నటించిన రామ్ పోతినేని, శ్రీలీల మరోసారి ఈ ప్రాజెక్ట్‌లో కలిసి కనిపించనున్నారనే ప్రచారం సాగుతోంది. ఇక ఈ భారీ చిత్రానికి ట్రెండింగ్ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండటం విశేషం. అయితే శ్రీలీల నిజంగానే 'ధర్మన్'లో భాగమైందా, ఆమె పాత్ర ఏంటి అనే విషయాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ భారీ ప్రాజెక్ట్‌తో శ్రీలీల మళ్లీ విజయాన్ని అందుకుని తన క్రేజ్‌ను తిరిగి సంపాదించుకుంటుందా అన్నది ఆసక్తికరంగా మారింది.

ఇంట్లో రమా రాజమౌళిదే బాస్!

భారతీయ చలనచిత్ర పరిశ్రమలో దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళికి ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులను సొంతం చేసుకున్న ఆయన సినిమా సెట్స్‌లో ఎంతో క్రమశిక్షణతో, గంభీరంగా కనిపిస్తుంటారు. అయితే ఇంట్లో మాత్రం సాధారణ భర్తేనని, భార్య రమా రాజమౌళి మాటకు విలువ ఇస్తారనే విషయాన్ని సరదాగా చూపించే ఓ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. రాజమౌళి కుమారుడు కార్తికేయ నిర్మించిన 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' సినిమా ప్రీ–రిలీజ్ వేడుక హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. రాజమౌళి, ఎంఎం కీరవాణి కుటుంబ సభ్యులతో పాటు జూనియర్ ఎన్టీఆర్ ముఖ్య అతిథిగా హాజరైన ఈ కార్యక్రమం కుటుంబ వేడుకను తలపించింది. ఈ సందర్భంగా రాజమౌళిని వేదికపైకి ఆహ్వానించగా, ఆయన వెనుకే ఉన్న రమా రాజమౌళి సరదాగా చేత్తో ఆయనను ముందుకు నెట్టారు. 'త్వరగా ముందుకు వెళ్లు' అన్నట్లుగా ఆమె చేసిన ఈ చిన్నపాటి సరదా చేష్ట అక్కడున్న వారిని ఆకట్టుకుంది. దీనికి సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలోకి రావడంతో క్షణాల్లో వైరల్‌గా మారింది. దీనిపై అభిమానులు, నెటిజన్లు తమదైన శైలిలో సరదా వ్యాఖ్యలు చేస్తున్నారు. సినిమాల విషయంలో ఎంత పెద్ద దర్శకుడైనా ఇంట్లో మాత్రం భార్య మాట వినాల్సిందే అంటూ కొందరు కామెంట్లు చేస్తుండగా, సినిమా సెట్స్‌లో రాజమౌళి బాస్ కావచ్చని, ఇంట్లో మాత్రం రమా రాజమౌళిదే అసలైన అధికారం అంటూ మరికొందరు స్పందిస్తున్నారు. సాధారణ భార్యాభర్తల మధ్య జరిగే సరదా సన్నివేశంలా ఈ క్షణం ఎంతో క్యూట్‌గా ఉందంటూ పలువురు కామెంట్లు చేస్తున్నారు. ఏదేమైనా వేదికపై చోటుచేసుకున్న ఈ చిన్నపాటి సరదా ఘటన రాజమౌళి, రమా రాజమౌళి మధ్య ఉన్న ఆప్యాయత, అనుబంధాన్ని చాటిచెప్పడంతో అభిమానులను ఆకట్టుకుంటోంది.



కాఫీ విత్ కరణ్'కు ఎండ్ కార్డ్

బాలీవుడ్ స్టార్ నిర్మాత, దర్శకుడు కరణ్ జోహార్ తన ఐకానిక్ టాక్ షో 'కాఫీ విత్ కరణ్'కు ముగింపు పలకడానికి సిద్ధమయ్యారు. గత 22 ఏళ్లుగా సినీ తారలతో ఆసక్తికర సంభాషణలు, సంచలన వ్యాఖ్యలు, వివాదాలు, వైరల్ క్షణాలతో ప్రేక్షకులను అలరిస్తున్న ఈ కార్యక్రమం ఇప్పుడు చివరి సీజన్‌కు చేరుకుంది. ఇప్పటికే ఎనిమిది సీజన్లను విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ పాపులర్ సెలబ్రిటీ టాక్ షో.. తొమ్మిదో సీజన్‌తో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ విషయాన్ని ప్రకటించిన కరణ్ జోహార్ భావోద్వేగానికి గురయ్యారు. 2004లో ఈ టాక్ షోను ప్రారంభించాలనే ఆలోచనను తన తండ్రి యశ్ జోహార్ తనతో పంచుకున్నారని, ఆ సమయంలో కార్యక్రమానికి బడ్జెట్ ఎలా సమకూరుతుందోనని తాను ఎంతో భయపడ్డానని కరణ్ గుర్తుచేసుకున్నారు. అయితే షో ప్రారంభమైన కొద్ది నెలలకే తన తండ్రిని కోల్పోయానని, ఆయనతో తాను చర్చించిన చివరి ప్రాజెక్ట్ 'కాఫీ విత్ కరణ్'నే అని భావోద్వేగంగా తెలిపారు. జీవితంలో కొన్ని ప్రయాణాలకు ఒక దశలో ముగింపు పలకాల్సిన సమయం వస్తుందని, తనకు ఈ షోతో ఉన్న అనుబంధం కూడా అలాంటిదేనని పేర్కొన్నారు. కార్యక్రమంపై ఎన్నో విమర్శలు, వివాదాలు వచ్చినప్పటికీ ప్రేక్షకుల ఆదరణ మాత్రం ఎప్పుడూ తగ్గలేదని చెప్పారు. తాను బయట ఎక్కడ కనిపించినా తన సినిమాల గురించి అడగడం కంటే 'కాఫీ విత్ కరణ్' తదుపరి సీజన్ ఎప్పుడు వస్తుందని అభిమానులు ఎక్కువగా అడిగేవారని తెలిపారు. తన జీవితంలో మరచిపోలేని ఎన్నో అందమైన జ్ఞాపకాలను అందించిన ఈ కార్యక్రమానికి ముగింపు పలకాల్సిన సమయం ఆసన్నమైందని కరణ్ జోహార్ స్పష్టం చేశారు. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ చివరి సీజన్ అక్టోబర్ 14 నుంచి డిస్నీ ప్లస్ హాట్‌స్టార్, జియో హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ కానుంది.



కేబీసీ సెట్‌లో అమితాబ్‌కు గాయం

బాలీవుడ్ సూపర్‌స్టార్ అమితాబ్ బచ్చన్ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న ప్రముఖ టెలివిజన్ రియాలిటీ షో 'కౌన్ బనేగా కరోడ్‌పతి' షూటింగ్ సెట్‌లో అపశ్రుతి చోటుచేసుకుంది. షూటింగ్ సమయంలో అమితాబ్ ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడినట్లు సమాచారం. ఈ ఘటనలో ఆయన మోకాలికి గాయమైనట్లు తెలుస్తోంది. షూటింగ్ జరుగుతున్న సమయంలో అకస్మాత్తుగా చోటుచేసుకున్న ఈ ఘటనతో సెట్‌లో ఒక్కసారిగా ఆందోళన నెలకొంది. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది, వైద్యులు ఆయనకు ప్రాథమిక చికిత్స అందించినట్లు సమాచారం. వయసు మీదపడుతున్నప్పటికీ అమితాబ్ బచ్చన్ ఎంతో శ్రమిస్తూ కేబీసీ షూటింగ్‌లో పాల్గొంటున్నారు. తాజాగా చోటుచేసుకున్న ఈ ఘటనతో బిగ్‌బీ అభిమానులు ఆందోళనకు గురవుతున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ సోషల్ మీడియా వేదికగా అభిమానులు ప్రార్థనలు చేస్తున్నారు.



కామెడీ ఎంటర్‌టైనర్‌గా 'టాల్కమ్ పౌడర్'

టాలీవుడ్ యంగ్ హీరో శివ కందుకూరి 'చూసి చూడంగానే' చిత్రంతో సినీ పరిశ్రమకు పరిచయమయ్యారు. ఆ తర్వాత 'గమనం', 'మను చరిత్ర', 'భూతద్దం భాస్కర్', 'అనగనగా', 'మనమే' వంటి వైవిధ్యమైన చిత్రాలతో ప్రేక్షకులను అలరించారు. ఇటీవల 'నవాబ్ కేఫ్'తో ప్రేక్షకుల ముందుకు వచ్చినా ఆశించిన స్థాయిలో విజయం దక్కలేదు. అయినప్పటికీ ఏమాత్రం నిరుత్సాహపడకుండా మరో కొత్త సినిమాతో తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు. తాజాగా శివ కందుకూరి నటిస్తున్న చిత్రానికి సంబంధించిన టైటిల్ గ్లింప్స్‌ను చిత్రబృందం విడుదల చేసింది. 'టాల్కమ్ పౌడర్' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేసిన ఈ సినిమా గ్లింప్స్ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తోంది. ధర్మపత క్రియేషన్స్ బ్యానర్‌పై రాజ్ కందుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రానికి సాయినాథ్ పొన్న దర్శకత్వం వహిస్తున్నారు. పూర్తి స్థాయి కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా తెరకెక్కుతున్నట్లు గ్లింప్స్‌ను చూస్తే స్పష్టమవుతోంది. ఇందులో శివ కందుకూరి తన కామెడీ టైమింగ్‌తో ఆకట్టుకున్నారు. 'బంటీ, అతని సాహసాలు' పేరుతో విడుదలైన గ్లింప్స్‌లో చివర్లో వచ్చే ''అతిగా ఆశపడే పెద్దర్.. అతిగా ఆవేశపడే డీలర్ బాగుపడినట్టు చరిత్రలో లేదు. పని చేస్కో'' అనే డైలాగ్ సోషల్ మీడియాలో ప్రత్యేకంగా ఆకట్టుకుంటోంది. ఫుల్ ఫన్ రైడ్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని నవంబర్ 13న గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సినిమాతో శివ కందుకూరి ఎట్టకేలకు మంచి విజయాన్ని అందుకుంటారని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

చందూ మొండేటి బాలీవుడ్ ఎంట్రీ?

'కార్తికేయ–2', 'తండేల్' వంటి చిత్రాలతో బాక్సాఫీస్ వద్ద విజయాలు అందుకున్న టాలీవుడ్ దర్శకుడు చందూ మొండేటి ఇప్పుడు మరో భారీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఆంజనేయుడి కథ ఆధారంగా రూపొందుతున్న భారీ పౌరాణిక 3డీ యానిమేషన్ చిత్రం 'వాయుపుత్ర' దసరా కానుకగా విడుదల కానున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. చందూ మొండేటి బాలీవుడ్‌లోకి అడుగుపెట్టబోతున్నారంటూ సోషల్ మీడియాలో వార్తలు వైరల్‌గా మారాయి. ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లో బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్ కుమార్, టాలీవుడ్ హంక్ రానా దగ్గుబాటి ప్రధాన పాత్రల్లో నటించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. పౌరాణిక కథాంశంతో తెరకెక్కనున్న ఈ చిత్రానికి 'మహాకాళి' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు సమాచారం. తొలుత ఈ సినిమాను ప్రముఖ బాలీవుడ్ నిర్మాత కరణ్ జోహార్ నిర్మించనున్నట్లు వార్తలు వచ్చాయి. అయితే తాజా సమాచారం ప్రకారం బాలీవుడ్ ప్రముఖ దర్శక–నిర్మాత సంజయ్ లీలా భన్సాలీ తన భన్సాలీ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్నట్లు తెలుస్తోంది. అంతేకా కుండా చిత్ర నిర్మాణంతో పాటు కథను కూడా సంజయ్ లీలా భన్సాలీయే అందిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. భారీ బడ్జెట్‌తో తెరకెక్కనున్న ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. అయితే చందూ మొండేటి బాలీవుడ్ ఎంట్రీ, అక్షయ్ కుమార్, రానా దగ్గుబాటి నటన, 'మహాకాళి' టైటిల్, భన్సాలీ నిర్మాణం వంటి అంశాలపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.




సంక్రాంతి బరిలో 'హలో డియర్'..

మమిత బైజు జోరు

'ప్రేమలు' సినిమాతో ఓవర్‌నైట్ స్టార్‌గా మారిన మలయాళ బ్యూటీ మమిత బైజు వరుస విజయాలతో బాక్సాఫీస్ వద్ద తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటోంది. ఇటీవల ఆమె నటించిన సినిమాలు ప్రపంచవ్యాప్తంగా ఏకంగా రూ.200 కోట్లకు పైగా వసూళ్లు సాధించడం విశేషం. కెరీర్ ప్రారంభంలోనే ఓ హీరోయిన్ నటించిన చిత్రాలు ఈ స్థాయిలో కలెక్షన్లు రాబట్టడం అరుదైన విషయంగా సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో మమిత బైజు ప్రస్తుతం బాక్సాఫీస్ లక్కీ చార్మ్‌గా మారింది. వరుస విజయాలతో మంచి జోష్‌లో ఉన్న ఈ మలయాళ భామ ఇప్పుడు తన తాజా చిత్రం 'హలో డియర్'తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. ఈ సినిమాలో ఆమెకు జోడీగా 'ప్రేమలు' ఫేమ్ సంగీత్ ప్రతాప్ నటిస్తున్నాడు. బ్లాక్‌బస్టర్ విజయం సాధించిన 'ప్రేమలు' తర్వాత మమిత బైజు, సంగీత్ ప్రతాప్ కలిసి నటిస్తున్న చిత్రం కావడంతో 'హలో డియర్'పై ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగింది. వీరిద్దరి కాంబినేషన్ మరోసారి ఎలాంటి మ్యాజిక్ చేస్తుందోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. డినోయ్ పాలోస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ఆషిక్ ఉస్మాన్ నిర్మిస్తున్నారు. వైవిధ్యమైన కథాంశంతో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. నిర్మాణ కార్యక్రమాలను త్వరగా చేసి ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా సినిమాను థియేటర్లలో విడుదల చేసేందుకు మేకర్స్ పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు సమాచారం. సంక్రాంతి పండుగ బరిలో ఇప్పటికే పలు భారీ చిత్రాలు ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో వాటికి పోటీగా 'హలో డియర్' కూడా థియేటర్లలోకి రానుండటం ఆసక్తికరంగా మారింది. 'ప్రేమలు'తో మమిత బైజు, సంగీత్ ప్రతాప్ జోడీకి వచ్చిన క్రేజ్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. మమితకు ఉన్న వరుస విజయాల జోరు, 'ప్రేమలు' జోడీపై ఉన్న క్రేజ్ కలిసి 'హలో డియర్'కు ఎంతవరకు కలిసొస్తాయో, బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా ఎలాంటి వసూళ్లను రాబడుతుందో చూడాలి.

నాగచైతన్య సరసన సాత్విక!





టాలీవుడ్‌లో సరికొత్త గ్లామర్‌తో వరుస అవకాశాలు అందుకుంటూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారుతోంది యంగ్ బ్యూటీ సాత్విక వీరవల్లి. దుల్కర్ సల్మాన్ హీరోగా పవన్ సాధినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఆకాశంలో ఒక తార' చిత్రంతో ఆమె కథానాయికగా టాలీవుడ్‌లోకి అడుగుపెడుతోంది. ఈ సినిమా దీపావళి కానుకగా నవంబర్ 20న గ్రాండ్‌గా థియేటర్లలోకి రానుంది. అయితే తొలి సినిమా విడుదల కాకముందే తన అందం, అభినయంతో పలువురు ప్రముఖ దర్శకనిర్మాతలను ఆకట్టుకుంటున్న సాత్వికకు వరుస అవకాశాలు తలుపు తడుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే టాలీవుడ్‌లో ఆమెకు ఓ బంపర్ ఆఫర్ దక్కినట్లు సోషల్ మీడియాలో పలు పోస్టులు వైరల్ అవుతున్నాయి. అక్కినేని నాగచైతన్య కెరీర్‌లో మైలురాయి చిత్రంగా తెరకెక్కనున్న 'ఎన్‌సీ–25'లో సాత్వికను కథానాయికగా ఎంపిక చేసినట్లు టాక్ వినిపిస్తోంది. దర్శకుడు కిశోర్ చెప్పిన సరికొత్త కథ, నాగచైతన్యకు నచ్చడంతో ఈ ప్రాజెక్ట్‌కు ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ఈ క్రేజీ ల్యాండ్‌మార్క్ ప్రాజెక్ట్‌లో నాగచైతన్య సరసన కొత్త ముఖం అయితే బాగుంటుందని భావించిన మేకర్స్ సాత్వికను హీరోయిన్‌గా ఎంపిక చేసినట్లు ప్రచారం జరుగుతోంది. డెబ్యూ చిత్రం విడుదలకు ముందే అక్కినేని నాగచైతన్య సరసన నటించే అవకాశం దక్కిందన్న వార్తలతో సాత్విక పేరు ప్రస్తుతం సోషల్ మీడియాలో మార్మోగుతోంది. 'ఆకాశంలో ఒక తార' విడుదలతో ఆమెకు ఎలాంటి స్పందన లభిస్తుందో చూడాలి.

Published And Owned By Adula Thirupathi, And Printed By Bommakanti Vinod Kumar, At Vangs Global Technologies Llp, #1-5-431/20/4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri, Telangana - 500010. And Published From D. No.: 8-3-228/157/A/1a, Rehmath Nagar, Jawahar Nagar, Yousufguda, Hyderabad, Telangana - 500045. **Editor: Adula Thirupathi. PRGI Regd No: TGTEL/26/A6187**, Email: Prajanaava@Gmail.Com. Phone No: 99484 33277.